# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :259 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 25-12-2025 | పేజీలు:4 వెల: 2.00

## హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులు

వాషింగ్టన్,విదేశీ ఉద్యోగులకు ఇచ్చే హెచ్-1బీ వీసా ఎంపిక పక్రియలో కీలక మార్పులకు అమెరికా ఇప్పటికే సిద్ధమైంది. దీనికి సంబంధించి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించగా.. వాటిపై తుది సమీక్ష మొదలైంది. నైపుణ్యం, వేతనాల ఆధారిత లాటరీ వ్యవస్థ కోసం రూపొందించిన నిబంధనలను 'ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్' సమీక్షిస్తోంది. ఈ మేరకు ఇమిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్ నివేదికను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించేలా అగ్రరాజ్యం ఈ కొత్త మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల జారీకి కంప్యూటరైజ్డ్ లాటరీ విధానాన్ని అనుసరిస్తుండగా.. ఇకపై వెయిటెడ్ సెలక్షన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనున్నారు. దీని ప్రకారం.. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటివి చేయనున్నారు.

## మేడారం జాతర.. గద్దెలపై కొలువుదీరిన పగిడిద్ద రాజు, గోవిందరాజులు



ములుగు : మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

## నేను కాంగ్రెస్‌లోనే ఉన్నా.. ఎట్టకేలకు ఒప్పుకున్న దానం నాగేందర్

హైదరాబాద్,తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒప్పుకున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు, ఏ పార్టీలో ఉన్నారో తనకు తెలియదని తెలిపారు.నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందని దానం నాగేందర్ అన్నారు. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కలిపి మొత్తం 300 డివిజన్లలో గెలుస్తాయని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అంతా ప్రచారం చేస్తానని.. కాంగ్రెస్ పథకాలను వివరిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు దిశగా గులాబీ పార్టీ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరూ తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో దానం నాగేందర్ మాత్రం తాను కాంగ్రెస్‌లో ఉన్నానని ఒప్పుకున్నారు. హైకమాండ్ నుంచి స్పష్టమైన హామీ రావడంతోనే దానం నాగేందర్ ఈ ప్రకటన



చేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ప్రియాంక గాంధీ ప్రధాని పదవికి అర్హురాలు..



న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత,ఎంపీ,లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఆయన సొంత బావ, రియల్ ఎస్టేట్ వ్యాపారి రాబర్ట్ వాద్రా కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ పేరు ఎత్తకుండానే కీలక కుంపటి రాజేశారు. పార్టీలో ప్రధాన మంత్రి పదవికి తన భార్య, వయనాడ్(కేరళ) ఎంపీ ప్రియాంక గాంధీ అర్హురాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో బలమైన గళం వినిపించారని చెబుతూ.. కాంగ్రెస్ పార్టీని ఆమె బలంగా లోక్‌సలో ముందుకు తీసుకువెళ్లారని వాద్రా చెప్పారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎంపీ.. ఇమ్రాన్ మసూద్ కూడా ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తేనే.. పార్టీకి ఆదరణ ఉంటుంది. అప్పుడే పార్టీ విజయం దక్కించుకునే అవకాశం వస్తుంది." అని ఇటీవల పార్లమెంటు శీతాకాల సమావేశాల ముగింపు సందర్భంగా మసూద్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే.. ఈ వ్యాఖ్యలు ఆయన సొంతమంటూ.. కొందరు నాయకులు వివాదం పెరగకుండా మౌనం పాటించారు. అదేసమయంలో ప్రియాంక గాంధీ కూడా మౌనంగా ఉండిపోయారు. తాజాగా ఈ వ్యాఖ్యలను కోట్ చేస్తూ.. ప్రియాంక భర్త, రాహుల్ బావ రాబర్ట్ వాద్ర కీలక వ్యాఖ్యలు చేశారు."పార్టీలో ఒక చర్చ జరుగుతోంది. అది నాదాకా కూడా వచ్చింది. నా వైఫ్(ప్రియాంక)ను ప్రధానిగా చూడాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు. చాలా చోట్ల ఇలాంటి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇటీవల పార్లమెంటులో కూడా ప్రియాంక బలమైన గళం వినిపించారు." అని వాద్రా వ్యాఖ్యానించారు. అంతేకాదు.. తాను కూడా రాజకీయాల్లోకి వచ్చే విషయంపై ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయంపై కూడా పార్టీలో చర్చ సాగుతోందని.. కార్యకర్తలు కోరుకుంటున్నారని వాద్రా చెప్పారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరనున్నట్టు తెలిపారు. ఒకే ఇంట్లో ఇద్దరు(భార్యాభర్త) రాజకీయాల్లో ఉండడం తప్పుకాదని.. అంతిమంగా ప్రజాసేవే లక్ష్యమని వాద్రా వ్యాఖ్యానించారు. కాగా.. రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలపై స్పందించాల్సి ఉంది.

## ఎల్వీఎం3-ఎం6 మిషన్ విజయవంతం.. కక్ష్యలోకి బ్లూబర్డ్ బ్లాక్-2 శాటిలైట్

శ్రీహరికోట: కమర్షియల్ మిషన్‌ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. ఇవాళ ఉదయం అమెరికాకు చెందిన కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూబర్డ్ బ్లాక్-2(BlueBird Block-2)ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఎల్‌వీఎం3-ఎం6 భారీ రాకెట్ ద్వారా ఆ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. 24 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే ఇవాళ ఉదయం ఉదయం 8.55 నిమిషాలకు ఎల్వీఎం3 రాకెట్ దూసుకెళ్లింది. ఆ రాకెట్ సుమారు 43.5 మీటర్ల పొడుగు ఉన్నది. దానికి ఎస్200 సాలిడ్ బూస్టర్లు ఉన్నాయి. శ్రీహరికోటలోని రెండోవ లాంచ్ ప్యాడ్ నుంచి దీన్ని ప్రయోగించారు. అంతరిక్ష కేంద్రం నుంచి ఎగిరిన సుమారు 15 నిమిషాల తర్వాత శాటిలైట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 520 కిలోమీటర్ల ఎత్తులో ఆ కక్ష్య ఉన్నట్లు ఇస్రో చెప్పింది.న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్), అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్‌మొబైల్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా బ్లూబర్డ్ శాటిలైట్‌ను ప్రయోగించారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో బ్లూబర్డ్ శాటిలైట్ విహరించనున్నది. మొబైల్ సర్వీసులు అందించేదుకు ఈ శాటిలైట్‌ను ప్రయోగించారు. 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, టెక్స్ట్‌లు, స్ట్రీమింగ్, డేటా ఎప్పుడైనా, ఎక్కడైనా ఈ శాటిలైట్ ద్వారా అందించనున్నారు. లో ఎర్త్ ఆర్బిట్‌లో మోహరించిన అతిపెద్ద కమర్షియల్



కమ్యూనిషేన్ శాటిలైట్‌గా దీన్ని గుర్తిస్తున్నారు.విజయవంతంగా శాటిలైట్ పరీక్ష చేపట్టిన ఇస్రో బృందంపై కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ విజన్‌ను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ఇస్రోను మెచ్చుకున్నారు. ఒక విజయం తర్వాత మరో విజయాన్ని నమోదు చేస్తూ అంతరిక్ష టెక్నాలజీ రంగంలో భారత సామర్థ్యాన్ని చాటుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## ఆరావళి పర్వత విధ్వంసాన్ని అడ్డుకోవాలి

హైదరాబాద్,ఢిల్లీకి సమీపంలోని అరావళి పర్వత శ్రేణుల్లో కార్పొరేట్ల హిల్ హౌస్‌లు పెరిగిపోతున్నాయని, పర్యావరణానికి, నీటి వనరులకు ఇది తీవ్ర నష్టమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరాయవారణ విధ్వంసానికి పరాకాష్ట అన్నారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతితో కలిసి విలేకరుల సమావేశంలో రాఘవులు మాట్లాడారు. ఆరావళి విధ్వంసాన్ని అడ్డుకోకపోతే దేశానికి తీవ్ర ముప్పు తప్పదన్నారు. ప్రకృతిని విధ్వంసం చేసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థలు డిస్కంలను ప్రయివేటు పరం చేసేందుకే మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టం తీసుకొచ్చిందన్నారు. తాజాగా ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో దేశానికే అత్యంత ప్రమాదకరమైన నాలుగు చట్టాలకు కేంద్రం ఆమోద ముద్ర వేసుకుందని, వాటి పరిణామాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించబోతున్నాయని హెచ్చరించారు. వాటికి వ్యతిరేకంగా కలిసొచ్చే శక్తులన్నింటిని, పార్టీలను కలుపుకుని దేశవ్యాప్త పోరాటాలను నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్పొరేట్లకు అధిక లాభాలు గడించేలా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇప్పటివరకూ విద్యుత్ పంపిణీ వ్యవస్థ 99 శాతం ప్రభుత్వ ఆధీనంలో నడిచేదని, దాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే మోడీ సర్కారు విద్యుత్ సవరణ చట్టాన్ని చేసిందని విమర్శించారు. ఈ చట్టం వల్ల క్రాస్ సబ్సిడీ ఎగిరిపోతుందని, రైతులు, పేదలు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కోల్పోతారని వివరించారు. అదాని, అంబాని, గోద్రెజ్, సుజాన్, వంటి విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఎప్పటి నుంచో పంపిణీ వ్యవస్థను తమకివ్వాలని ఒత్తిడి తేవడంతోనే మోడీ సర్కారు ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తెలంగాణలో మూడో డిస్కమ్ ఏర్పాటును రేవంత్‌రెడ్డి సర్కారు ప్రకటించడాన్ని



తప్పుబట్టారు. 'విబి జి ఆర్ఎఎంజి' చట్టం రాష్ట్రాలకు పెనుభారంగా మారబోతోందని, ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రాలు 40 శాతం నిధులను ఖర్చుచేయకపోతే కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులను ఆపేస్తుందని తెలిపారు. దేశంలోనే ఎక్కువ పనిదినాలను వాడుకుంటున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోబోతున్నాయని నొక్కి చెప్పారు. 'సబ్‌కా బీమా సబ్‌కా రక్ష కాదు సబ్‌కీ బీమా కరోడ్‌పతికా రక్ష' అనే ఇన్సూరెన్స్ చట్టంలో మార్పులున్నాయని, విదేశీ సంస్థలకు ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని మోడీ సర్కారు కల్పించిందని విమర్శించారు. శాంతి పేరుతో తీసుకొస్తున్న న్యూక్లియర్ లయబులిటీ బిల్లు విదేశీ సంస్థలు కంపెనీలు స్థాపించే అవకాశాన్ని కలిస్తుందని, ప్రమాదాలు జరిగితే కంపెనీల బాధ్యత కాదని ఆ చట్టంలో పేర్కొనడం దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. నిజమైన దేశభక్తులు ఎన్‌డిఎ, దాని మిత్రపక్షాలు కాదని, దేశ రక్షణ కోసం కొట్లాడుతున్న కమ్యూనిస్టులు, లౌకికశక్తులు, ప్రజలు నిజమైన దేశభక్తులని స్పష్టం చేశారు. బిజెపి చేతుల్లో ఇసి పావుగా మారిందన్నారు.

## మీరు కూడా దేశాన్ని వీడి పారిపోవాల్సి వస్తుంది..




ఢాకా,ఇంఖిలాబ్ మంచ్ అధికార ప్రతినిధి ఉస్మాన్ హాదీ పై హత్య దరిమిలా బంగ్లాదేశ్ లో మరోసారి హింస చెలరేగిన విషయం తెలిసిందే. అయితే, హాదీ హత్యలో ప్రభుత్వ ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో హాదీ సోదరుడు షరీఫ్ ఒమర్ హాదీ తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. హాదీ హత్యలో యూనస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల హస్తం ఉన్నట్లు ఆరోపించారు. వచ్చే ఏడాది జరిగే జాతీయ ఎన్నికలను పక్కదారి పట్టించేందుకు ఓ స్వార్థ వర్గం ఈ హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపించారు. షాబాగ్‌లోని నేషనల్ మ్యూజియం ముందు ఇంఖిలాబ్ మంచ్ నిర్వహించిన కార్యక్రమంలో ఒమర్ హాదీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. 'నా సోదరుడు ఉస్మాన్ హాదీని చంపింది మీరే (యూనస్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ). దీన్ని ఓ సమస్యగా చూపించి వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలు రద్దు చేయాలని చూస్తున్నారు. ఎన్నికల వాతావరణం దెబ్బతినకుండా నా సోదరుడి హత్యపై వేగంగా దర్యాప్తు జరిపి హంతకులను పట్టుకోవాలి. హాదీకి న్యాయం జరగకపోతే.. మీరు కూడా ఏదో ఒకరోజు బంగ్లాదేశ్‌ను వీడి పారిపోవాల్సిన పరిస్థితి వస్తుంది' అని తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్‌ను హెచ్చరించారు.ఇటీవల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి, తిరుగుబాటు నాయకుడు, భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే షరీఫ్ ఉస్మాన్ హాది (32) మరణించిన విషయం తెలిసిందే. హాదీ విద్యార్థి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. జులైలో జరిగిన ఉద్యమం షేక్ హాసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఆ ఉద్యమంతో షేక్ హాసీనా దేశం వీడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆమె భారత్‌లో తలదాచుకుంటున్నారు.

## ఢిల్లీలో మూడు రోజులు ఉంటే.. అలర్జీలు వచ్చాయి

న్యూఢిల్లీ, దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు.

### ఢిల్లీలో నేను ఉండలేను..

కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ



ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

## ఏసుప్రభు బోధనలు ప్రపంచానికే మార్గదర్శకం



కొల్లాపూర్ : ఏసుప్రభు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమని ఆచరణీయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్ హాల్‌లో క్రిస్మస్ ప్రేమ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి జన్మ సార్థకం కావాలంటే ఏసు బోధించిన ప్రేమ సమానత్వం బాటలో నడవాలన్నారు. మనిషి పుట్టినప్పుడు శ్వాస ఉంటుందని మనిషి పోయిన తర్వాత పేరు మాత్రమే ఉంటుందన్నారు. అందర్నీ ప్రేమించడం అందరిని సన్మార్గంలో పెట్టడం ఏసు బోధించిన బోధనల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ఏసు మార్గం చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందని శాంతి సమానత్వం ప్రేమను పంచుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం కేకును కట్ చేసి క్రిస్టియన్స్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు, అలాగే క్రిస్టియన్ కమ్యూనిటీ కల్చరల్ హాల్ కోసం రూ. 25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ భన్సిలాల్, తాసిల్దార్ లు భరత్ కుమార్, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజ్ కుమార్ ఆర్ఐ గోవింద్ రెడ్డి,రెవెన్యూశాఖ సిబ్బంది, వివిధ చర్చిల పాస్టర్స్ పాల్గొన్నారు.

### జగన్‌కు జ్వరం..కార్యక్రమాలు రద్దు

పులివెందుల,వైసిపి అధినేత వైఎస్.జగన్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో బాధపడుతున్న కారణంగా డాక్టర్ల సూచన మేరకు కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు వైసిపి ఎక్స్ వేదికగా ఈ ప్రకటనను విడుదల చేసింది.

## సంపాదకీయం

గురువారం 25-12-2025

# పేదరికం పెరుగుతుంటే తగ్గుతున్నట్టు చూపించడం ఎలా ?

2025లో ప్రపంచబ్యాంక్ ప్రపంచంలో నిరుపేదల సంఖ్య, అంటే బొత్తిగా ఏమీ లేనివారి సంఖ్య చాలా వేగంగా తగ్గిపోతున్నదంటూ ప్రకటించింది. ఈ తగ్గుదల ప్రత్యేకించి ఆసియా ఖండంలో ఎక్కువగా జరిగినట్లు తెలిపింది. దీనిని ఆధారం చేసుకుని ఇప్పటికే చాలా ప్రచారం జరిగింది. ప్రపంచబ్యాంక్ ప్రకటించినదే నిజం అయితే అది చాలా ఆనందాన్ని కలిగించే విషయమే. కాని ఆ ప్రకటన వాస్తవం కాదు. ఈ బూటకపు ప్రకటన ప్రపంచబ్యాంక్, ప్రభుత్వాలు గత కొన్ని దశాబ్దాలుగా ఆచరిస్తున్న గణాంకాల తారుమారు నుంచి పుట్టుకొచ్చింది. ఈ తప్పుడు పద్ధతి మీద ఎన్ని విమర్శలు వచ్చినా వాళ్ళకి ఖాతరు లేదు. గత 50 సంవత్సరాలుగా పేదలు చేసే ఖర్చు స్థాయిని తక్కువ చేసి చూపిస్తున్నారు. అంటే, ఆ కనీస స్థాయి ఖర్చు కన్నా ఎక్కువ ఖర్చు చేస్తున్న వారంతా పేదరికంలో లేనట్టే లెక్క. అందుచేత ఆ స్థాయిని ఎంత తక్కువగా చూపితే పేదరికం అంత తక్కువగా ఉన్నట్టు చెప్పుకోవచ్చు. ఈ కనీస స్థాయిని కూడా క్రమంగా తగ్గిస్తూ వచ్చారు. ఇప్పుడు అది ఎక్కడిదాకా వచ్చిందంటే మనిషన్నవాడెవడూ అంత తక్కువ ఖర్చుతో బతకడం అసాధ్యం. ఇండియాలో నిరు పేదలు జనాభాలో 5.25 శాతం మాత్రమే ఉన్నారంటూ ప్రపంచబ్యాంక్ ప్రకటించింది. తలసరి రోజు ఖర్చు రూ.62గా నిర్ధారించి అంతకన్నా తక్కువ ఆదాయం వస్తున్నవారు 5.25 శాతం మాత్రమే ఉన్నారని ప్రకటించింది. ఇక నీతి ఆయోగ్ 2022-23 నాటికి దేశంలో 5 శాతం మాత్రమే నిరుపేదలు ఉన్నట్లు ప్రకటించింది. గ్రామాల్లో రూ.57, పట్టణాల్లో రూ.69 చొప్పున రోజుకు తలసరి ఆదాయం గనుక వస్తే వారంతా నిరుపేదలు కానట్లే లెక్కించింది. ఈ సొమ్ముతో గ్రామాల్లో 2.9 లీటర్ల నీరు మాత్రమే వస్తుంది. అదే పట్టణాల్లో 3.5 లీటర్ల నీరు మాత్రం కొనగలుగుతారు. పేదరిక స్థాయి నిర్ధారించేటప్పుడు ఆ సొమ్ముతో రోజువారీ ఆహారపు అవసరాలతోబాటు వైద్యానికి, దుస్తుల వగైరాలకు, రవాణాకు, అద్దెకు కూడా చెల్లించగలిగేలా ఉండాలి. ఇప్పుడు నిర్ణయించిన స్థాయిలో బతకాలంటే వాళ్ళు ఇల్లూ వాకిలీ లేని బిచ్చగాళ్ళుగా మాత్రమే మిగులుతారు. ఈ లెక్కన చూస్తే మరో ఏడాది నాటికి ఇండియాలో నిరుపేదలు అనేవారే లేరంటూ ప్రభుత్వం ప్రకటించవచ్చు. ఎందుకంటే ఇంత తక్కువ స్థాయిలో బతకలేక ఆ నిరుపేదలంతా అప్పటికి చచ్చిపోతుంటారు. కనీస పౌష్టికాహార స్థాయిని బట్టి పేదరికపు స్థాయిని గనుక నిర్ణయిస్తే పేదరికపు నిర్ణయించడానికి మూడు రెట్లైనా ఉంటుంది. ఆ స్థాయికి దిగువన ఇప్పుడు 65 శాతం ప్రజలు పడిపోయారు."సొమ్మున్ని పెంపొందించే శిక్షణ" పేరుతో మూడవ ప్రపంచ దేశాలలోని ఆర్థికవేత్తలకు పేదరికపు అంచనాల మీద శిక్షణ నివ్వడానికి ప్రపంచబ్యాంక్ తన సలహాదారులను పంపుతోంది. వీళ్ల సలహా మేరకు చైనాలో పేదరికపు స్థాయిని నిర్ణయించారు. అక్కడ 1978 నాటి ధరల ప్రకారం ఏడాదికి 100 యువాన్లు వస్తే పేదరికంలో లేనట్టే లెక్క. దానిని 1997 ధరల స్థాయికి సవరించి, ఆహారేతర ఖర్చులను కూడా కలిపి రోజుకు తలసరి ఆదాయం 8.8 యువాన్లుగా తేల్చారు. ఆ సొమ్ముతో కేవలం 2.1 లీటర్ల మంచి నీరు మాత్రమే వస్తుంది. 2019 నాటికి ఈ ప్రాతిపదికన చైనాలో అసలు నిరుపేదలే లేకుండా పోయారు. దీనిని ఒక విజయంగా ప్రపంచబ్యాంక్ ప్రచారం చేసింది. ఆ తర్వాత 2020లో కనీస స్థాయిని 11 యువాన్లకు పెంచారు. విశ్లేషకుల అంచనాల ప్రకారం ఇప్పటికీ చైనాలో కనీస స్థాయిలో జీవించాలంటే నెలకు తలసరి ఆదాయం కనీసం 1000 యువాన్లు ఉండాలి. అధికారిక పేదరికపు స్థాయి కన్నా ఇది మూడు రెట్లు ఎక్కువ. ఈ మాత్రం ఖర్చు చేయలేని స్థితిలో ఉన్నవారు నేటికీ చైనా జనాభాలో ఐదో వంతు ఉన్నారు. అందుచేత అక్కడ నిరుపేదలు సున్నా శాతం అని, ఇండియాలో 5 శాతం అని చెప్పుకోవడం ఒట్టిమాటే.అయితే, ఇటీవల చైనాలో శిక్షణ పొందిన పలువురు కార్యకర్తలను వేలాదిమందిని గ్రామీణ ప్రాంతాలకు పంపి అక్కడి ప్రజలు వాస్తవంగా గడుపుతున్న జీవనాన్ని పరిశీలించి నిరుపేదలుగా ఉన్నవారిని స్థానిక సంఘాల సహాయంతో గుర్తించి వారికి భారీ మొత్తాలను సహాయంగా అందించి వాళ్ళు పేదరికం నుంచి బైట పడడానికి నిర్దిష్టమైన చర్యలను తీసుకోవడం మొదలుపెట్టింది. ఒకమేరకు అదే విధమైన పద్ధతిలో ఇక్కడ కేరళలో ప్రభుత్వం వలంటీర్ల, స్వచ్ఛంద సంస్థల నెట్వర్క్ సహాయంతో దుర్భర దారిద్ర్యంలో బతుకుతున్నవారిని గుర్తించి వారికి తగు విధంగా పునరావాసానికి సహాయం అందించడంలో జయప్రదం అయింది.ప్రపంచబ్యాంక్ మాత్రం ఇటువంటిదేమీ చేయడం లేదు. నిరుపేదరికపు స్థాయిని అమెరికన్ డాలర్లలో రోజుకు 3 డాలర్లుగా నిర్ధారించింది. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడు డాలరు-రూపాయి మారకపు విలువ ప్రకారం పేదరికపు స్థాయి రూ.270గా ఉండాలి. కాని వాస్తవ మారకపు రేటు ప్రకారం కాకుండా అందులో 0.28 శాతం రేటు ప్రకారం మాత్రమే లెక్కిస్తోంది! ఇక్కడి అధికారిక పేదరిక స్థాయికి దగ్గరగా ఉండేట్టు వాస్తవ మారకపు రేటును సవరిస్తోంది!ఇలా వివిధ దేశాల్లో అధికారిక లెక్కల్లో పేదరికపు స్థాయిని ఎందుకింత హీనమైన స్థాయికి దిగజారుస్తున్నారు? ఆ స్థాయిలో ప్రాణాలను నిలబెట్టుకోవడమే అసాధ్యం అన్న వాస్తవాన్ని తెలిసి కూడా ఎందుకిలా చేస్తున్నారు? చాలా దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఈ పేదరికపు స్థాయిని లెక్కించే విధానాన్ని పౌష్టికాహార లభ్యత అన్న అంశంతో విడగొట్టి లెక్కించడం మొదలుపెట్టాయి. ఇది ప్రపంచబ్యాంక్ ఆదేశం మేరకే జరుగుతోంది. మొట్టమొదట లెక్కించిన కనీస పేదరిక స్థాయి మాత్రమే సరైన పద్ధతిలో, కనీస స్థాయి పౌష్టికాహార లభ్యత అన్న ప్రమాణాన్ని పాటిస్తూ నిర్ధారించడం జరిగింది. ఇక ఆ తర్వాత లెక్కించిన ప్రతిసారీ, మొదటి లెక్క ప్రకారం నిర్ధారించిన దానిని ధరల సూచీ ఆధారంగా సవరిస్తూ వచ్చారు. అలా సవరించిన తర్వాత ఆ సొమ్ముతో కనీస పౌష్టికాహారం పొందగలుగుతున్నారా లేదా అన్నది మాత్రం ఎక్కడా పరిశీలించిన పాపాన పోలేదు. ఈ ధరల సూచీని లెక్కించే విధానం ఏమిటి? కొన్ని కనీస అవసరాలైన వస్తువులను, సేవలను కలిపి వాటిలో ఏది ఎంత అవసరమో నిర్ధారిస్తారు. ఆ ప్రకారం ఆ వస్తువులను, సేవలను పొందడానికి ఎంత ఖర్చు అవుతుందో నిర్ణయిస్తారు. ఇది ప్రారంభ సంవత్సరంలో మాత్రమే. దానిని బేస్ ఇయర్ (ప్రాతిపదిక సంవత్సరం) అంటారు. ఇక ఆ తర్వాత లెక్కించిన ప్రతిసారీ వాటి వాస్తవ ధరలలో వచ్చిన మార్పులను పట్టించుకోరు. మొత్తం మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులను బట్టి సవరిస్తుంటారు. ఇది బేస్ ఇయర్ 1973. 1973లో అది 1978. 1973లో ఇండియాలో కనీస స్థాయి లెక్క వేసినప్పుడు గనుక అప్పటి ప్రభుత్వం "మేము 1921 నాటి ధరలను తీసుకుని వాటిని ఆ తర్వాత పెరిగిన రేటు ప్రకారం సవరిస్తాం" అనిగాని ప్రకటించి వుంటే ఎంత హాస్యాస్పదంగా ఉండేది? అప్పుడు ప్రభుత్వం అలా చేయలేదు. ఆనాటి వాస్తవ ధరలతో పేదరికపు లెక్కలు తీసుకుంది. కాని ఇప్పుడు ప్రభుత్వాలూ, ప్రపంచ బ్యాంక్ గాని 52 సంవత్సరాల క్రితపు ధరల ప్రాతిపదిక మీదనే లెక్కిస్తూమంటున్నాయి!

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ఇలాగా?



అమరావతి,రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం 'ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం' అని పదేపదే చెబుతు న్నప్పటికీ, కనిపిస్తున్న వాస్తవాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. నిజమైన బలోపేతం అంటే పిల్లల సంఖ్య పెరగాలి. సరిపడా ఉపాధ్యాయులు ఉండాలి. వారికి బోధనకు పూర్తిస్థాయి సమయం ఉండాలి. పాఠశాలల్లో గుణాత్మక విద్య వికసించాలి. కానీ నేడు ఈ అవసరాలకు బదులుగా సమస్యలే పెరుగుతున్నాయి.

విద్యార్థుల తగ్గుదలే! బలోపేతం ఎక్కడీ

గత మూడు విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఇలా తగ్గిపోయింది. 2023-24లో 81,08,406 మంది విద్యార్థులు ఉండగా, 2024-25లో 78,69,714కు, 2025-26 నాటికి 76,02,854 తగ్గుతూ వున్నారు. ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో పిల్లలు ప్రభుత్వ పాఠశాలల నుండి జారిపోతున్నారు. ఇది బలోపేతానికి సంకేతమా లేక బలహీనతకు చిహ్నామా? గత ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలను ప్రస్తుత ప్రభుత్వం అప్పుడు విమర్శించింది. ఇప్పుడు వాటిని రద్దు చేయకుండా అదే దారిలో మరిన్ని దుష్పరిణామాలకు దారితీసే చర్యలను తీసుకొస్తున్నది. 'సాల్ట్' వంటి ఒప్పందాలు వేగంగా అమలవుతున్నాయి.

ఉపాధ్యాయులను పాఠం చెప్పనీయని వ్యవస్థ

విద్యా సంవత్సరం మొదలైన రోజు నుంచే పాఠాలు చెప్పే అవకాశాన్ని యాప్‌లు, రికార్డులు, మీటింగ్‌లు, అప్రయోజక కార్యక్రమాలు అడ్డుకుంటున్నాయి. లీప్ యాప్‌లో 70 రకాల టైల్స్, విద్యామిత్ర, ఐఎమ్ఎమ్ఎస్, దీక్ష, పి.ఎం, ఎస్ఎఎస్ఎ వంటి అప్లికేషన్ల పనులు ఉపాధ్యాయుల సమయాన్ని పూర్తిగా ఆక్రమిస్తున్నాయి. ఆన్‌లైన్ శిక్షణలు, 20 రోజులపాటు యోగా డే, మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలు ఇవన్నీ కలిపి బోధనా పీరియడ్లను తీవ్రంగా తగ్గించాయి. పరీక్షల మూల్యాంకనం గందరగోళంగా ఉందని ఉపాధ్యాయుల అభిప్రాయం. ఎన్ఇపి విధానాల బలవంతపు అమలు పరిస్థితులను మరింత క్లిష్టం చేశాయి. ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడూ చూడని విధంగా "పాఠాలు చెప్పనీయండి" అంటూ ఉపాధ్యాయులు ఉద్యమానికి దిగాల్సిన పరిస్థితి వచ్చింది.

పిల్లలు తగ్గుతున్నా 'సంస్కరణలు' పెరుగుతున్నారు!

పిల్లలు తగ్గిపోతున్నారు. ఉపాధ్యాయులు తగ్గుతున్నారు. తరగతులు విలీనమవుతున్నాయి. పాఠశాలలు మూత పడుతున్నాయి. తొమ్మిది రకాల పాఠశాలలతో గందరగోళం పెరిగింది. ఈ పరిస్థితుల్లో విద్యను బలోపేతం చేస్తామనడాన్ని ఎలా నమ్మాలి? ఉపాధ్యాయుల బోధనకన్నా డిజిటల్ ట్రాకింగ్, యాప్‌లు, గణాంకాలు ముఖ్యమయ్యాయి. పిల్లల అభ్యసనానికి అవసరమైన వాతావరణం బలహీనమైంది.

ఆకర్షణ కోల్పోతున్న ఉపాధ్యాయ వృత్తి

వర్క్ ఫౌండేషన్, ఎన్ఎఫ్ఇఆర్ నివేదికల ప్రకారం ఉపాధ్యాయులు అత్యధిక ఒత్తిడికి గురవుతున్నారు. సెలవుల్లో కూడా వృత్తికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. నిరంతర ఆన్‌లైన్ గణాంకాల సమర్పణ ఒక నియమంగా మారింది. 35 దేశాల సర్వేలో భారత యువత ఉపాధ్యాయ వృత్తిని 8వ స్థానంలో మాత్రమే ఎంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరగడం, గౌరవం తగ్గడం దీనికి ప్రధాన కారణాలు.

రాష్ట్రంలో సంక్షోభ కారణాలు స్పష్టమే

మాతృభాషలో బోధన నిలిపివేత, పూర్తిగా ఆంగ్ల మాధ్యమం, 9 రకాల పాఠశాలలు, సింగిల్ మీడియం కారణంగా ఉపాధ్యాయుల తగ్గింపు, ప్రాథమిక పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల బదిలీలు, 12 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు, బడ్జెట్ కేవలం రూ.10 కోట్లు మాత్రమే. ఒకే ఏడాదిలో 2,66,860 మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు మారారు. ఈ సంఖ్యలు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరిగిన అనుమానం, విధానాల వైఫల్యాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ప్రభుత్వ పాఠశాలలు నిజంగా బలపడాలంటే

నష్టదాయక సంస్కరణలను తక్షణం రద్దు చేయాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకే పరిమితం చేయాలి. పరీక్షా, మూల్యాంకన విధానాల పునర్విమర్శ, ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక నిధుల కేటాయింపు, ఎన్ఇపి 2020 రద్దు, రాష్ట్ర అవసరాలకు అనుగుణమైన విధానం చేపట్టడం వంటి అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో విస్తృత చర్చలు చేయాలి.విద్యారంగం బలోపేతం కావాలంటే మాటలు కాదు. లోపాలను అంగీకరించి, విధానాలను సరిచేసి, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచే దిశగా ప్రభుత్వం నడవాలి. విద్యను వ్యాపారీకరణ వైపుకు లాక్కెళ్లే మార్గాలను విడనాడి, పిల్లల అభివృద్ధి కేంద్రంగా ఉండే పాఠశాల వ్యవస్థను పునర్నిర్మించడం ద్వారా మాత్రమే నిజమైన బలోపేతం జరుగుతుంది.

# స్వరం మార్చిన మోడీ

న్యూఢిల్లీ,బిజెపి ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ తన స్వరం మార్చారు. పొరుగు దేశాల నుంచి సరిహద్దులు దాటుకుని చొచ్చుకు వస్తున్న చొరబాటుదారుల సమస్యపైన, ఎన్నికల కమిషన్ ఆదేశాలపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ఐఆర్) ను సమర్థించడం పైన ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి వాటినే తమ ప్రచారానికి ప్రధాన ఇంధనంగా వాగ్బాణాలు కురిపిస్తున్నారు. అంతేకాదు విపక్ష పాలిత రాష్ట్రాల్లో తుపాకులు ఎక్కుబెట్టి అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం తప్పనిసరి అని బెదిరిస్తున్నారు. 'జంగిల్‌రాజ్' (ఆటవిక పాలన) అనే బెదిరింపుతో బీహార్‌లో ఏ విధంగా ఓట్లను కొల్లగొట్టి గెలుపొందారో అనే రీతిలో విపక్ష రాష్ట్రాల్లో ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లో జంగిల్‌రాజ్ బూచి చూపించి బెదిరిస్తున్నారు. చొరబాటు సమస్యపై మోడీ ఒక్కరే ఆందోళన చేస్తున్నట్టు కాదు, దాని ప్రభావం మొదటిసారి స్థానిక జనాభాపై చూపించింది. ఈ ఏడాది మొదట్లో జార?ండ్‌లో మోడీ ప్రయోగించిన ఏకైక అతి ముఖ్యమైన ప్రచార థీమ్ 'చొరబాటుదారుల సమస్య' ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న చొరబాటుదారుల వల్ల స్థానిక జనాభాకు ఒక బెదిరింపుగా మారింది.ఈ ప్లాను ఎన్నికల్లో వర్క్‌అవుట్ కానప్పటికీ గిరిజన ప్రజలు ఎక్కువగా నివసించే సరిహద్దు రాష్ట్రం అంత ఆసక్తిగా స్పందిచనప్పటికీ, రాబోయే ప్రమాదం ఉందని మోడీ హెచ్చరించారు. ఇప్పుడు ఆ థీమ్‌నే తదుపరి గమ్యస్థానానికి తీసుకెళ్తున్నారు. బిజెపి తన పార్టీ అజెండాలో రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. అక్కడ కొన్ని చొరబాట్లను చూపించడంలో కొంతవరకు పురోగమించగలిగింది. ఇతర రాష్ట్రాలతో సమానంగా సుస్థిర అభివృద్ధిని పార్టీ సాధించలేని పరిస్థితుల్లో అక్కడ గెలుపొందడానికి వేరే మార్గాలను అనుసరిస్తోంది. పశ్చిమబెంగాల్ విషయంలో ఎలాగైనా ఓట్ల బ్యాంకును కొల్లగొట్టాలన్న వ్యూహంతో అక్రమ చొరబాటుదారులకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని అందుకే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను అడ్డుకుంటోందని మోడీ పెద్ద అభాండం వేశారు. దీనికి తోడు అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలు తున్నాయని, ఇది మహాజంగిల్ రాజ్ వంటి పరిస్థితి అని ఆరోపించారు. కానీ ఓటర్ల జాబితా సవరణ విషయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గట్టిగానే ఉన్నారు. సవరణ పేరుతో భారీ ఎత్తున ప్రజల ఓటు హక్కును కాజేస్తున్నారని, ప్రత్యేకించి మైనారిటీలు, పేదల ఓటు హక్కు కోల్పోతున్నారని ఆమె ఆరోపిస్తున్నారు. ఓటర్ల సవరణ మొదటి జాబితాలో తొలగించిన ఓటర్ల పేర్లను పరిశీలిస్తే మాతువా సామాజిక వర్గానివే ఎక్కువగా ఉన్నాయి.హిందూ నామసుద్రలకు చెందిన వీరంతా బంగ్లాదేశ్ (నాటి తూర్పు పాకిస్తాన్) నుంచి పశ్చిమబెంగాల్‌కు 1947లో ఎప్పుడో తరలివచ్చారు. ఉత్తర 24 పరగణాలు, నాడియా, హౌరా, కూచ్ బీహార్ తదితర సరిహద్దు జిల్లాల్లో వీరు ఉంటున్నారు. పశ్చిమ బెంగాల్‌లో రెండో భారీ షెడ్యూల్డ్ కులంగా మాతువా సామాజిక వర్గం ఉంటోంది. వీరు ఓటు హక్కు కోల్పోవడంపై ప్రధాని మోడీ ఇంతవరకు ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ఇప్పుడే కాదు 2019, 2021లో ప్రధాని మోడీ ఈ ప్రాంతానికి వచ్చినా వారి పౌరసత్వం గురించి ఎలాంటి హామీ ఇవ్వలేదు. గత ఎన్నికల్లో బిజెపికి మద్దతు పలికిన ఈ సామాజిక వర్గం ఎస్ఐఆర్ మొదటి దశ తరువాత ఓటర్ల జాబితా నుంచి భారీ సంఖ్యలో వీరి పేర్లు తొలగించబడ్డాయి. అయితే ఎన్నికల కమిషన్ మాత్రం తొలగించిన ఓటర్ల పేర్లలో అనేక మంది పేర్లు ఉనికిలో లేకపోవడం కానీ, లేదా వారి తల్లిదండ్రుల పేర్లు అయినా 2002 నాటి జాబితాలో కనిపించలేదని చెబుతోంది. అయితే మాతువా సామాజిక వర్గం తమ ఓటు బ్యాంకుగా పరిగణించిన బిజెపి, మాతువాలకు, ఇతర బంగ్లాదేశ్ శరణార్థులకు చట్టం ప్రకారం పౌరసత్వం కల్పించేందుకు బిజెపి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసింది.ఓటర్ల జాబితాలో వీరిని చేరుస్తామని బిజెపి భరోసా ఇస్తున్నా ఇంకా వారిలో నమ్మకం కలగడం లేదు. ఎస్ఐఆర్ నుంచి తమ ఓటు హక్కు తొలగించారని మాతువా లోని ఒక వర్గం ఠాకూర్ నాయకత్వంలో ఆందోళన చేపట్టింది. చొరబాటుదారులన్నది పెద్ద సమస్యే. చొరబాటుదారులకు ఓటు హక్కు ఉండాలని ఎవరూ వాదించరు. కానీ దేశ పౌరులను గుర్తించడానికి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియను వినియోగించి వారి పేర్లు లేవని, పౌరులు కారని వారి పేర్లను తొలగించడమే రాజ్యాంగ పరంగా చెల్లుబాటు



కాని విధానం. ప్రధాని మోడీ చొరబాటుదారుల ఓటరు జాబితాను ప్రక్షాళన చేయడంలో ఎస్ఐఆర్ అత్యంత సామర్థ్యాన్ని చూపిస్తోందని పదేపదే ప్రశంసిస్తున్నారు.కానీ దీనివల్ల ఎస్ఐఆర్ అంటే జాతీయ పౌరుల జాబితా తయారీ విధానాన్ని మరో మార్గంలో అమలు చేస్తున్నారని ఒక వర్గం వారికి భయాందోళనలను రేకెత్తిస్తూ మరిన్ని ఆత్మహత్యలకు దారితీస్తోంది. మరింత ఆందోళనకరంగా మైనారిటీల పట్ల అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించేలా ప్రోత్సహించే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తన ఉద్దేశాలను స్పష్టంగా తేటతెల్లం చేయగలగాలి. చొరబాట్లను పదేపదే సూచించడం పారదర్శకం కాదు. పశ్చిమబెంగాల్‌ను ప్రధాని మోడీ జంగిల్‌రాజ్‌గా పోల్చి ప్రచారం చేయడం కూడా అత్యంత వివాదాస్పదమే. బీహార్‌లో శాంతిభద్రతలు పేలవం అన్న అంశం బాగానే ఆకట్టుకున్నా, పశ్చిమబెంగాల్‌లో అలాగే ఆ థీమ్‌ను స్వాగతిస్తారన్నది ప్రశ్నార్థకం. విచిత్రంగా తృణమూల్ కాంగ్రెస్ కూడా అదే థీమ్‌తో ఇదివరకటి వామపక్ష ప్రభుత్వ పాలనలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో చట్టబద్ధపాలన అనే ఆలోచనను కూల్చివేసిందని ఆరోపిస్తోంది.

## చెక్‌డ్యామ్‌లు కూలాయా..కూల్చివేశారా ?

కరీంనగర్,మ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెంచడంతోపాటు రైతులకు సాగునీరు ఇచ్చేందుకు గతంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కూలిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో వందల కోట్లు ఖర్చుచేసి నిర్మించిన ఈ చెక్‌డ్యామ్స్ ద్వారా దాదాపు 10 వేల ఎకరాల్లో సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. కానీ ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్థకం కావడం ఆందోళన కలిగిస్తోంది. చెక్ డ్యామ్స్ వరుసగా కూలిపోతుండటం హాట్ టాపిక్‌గా మారింది. నవంబర్‌లో గుంపుల-తనుగుల గ్రామాల మధ్య ఉన్న చెక్ డ్యామ్ రాత్రికి రాత్రే కొట్టుకుపోయిన ఘటన కలకలం రేపింది. తిరిగి రెండ్రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లి శివార్లలో మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం పూర్తిగా ధ్వంసమైపోయింది. ఈ రెండిటి ఆధారంగా వందల ఎకరాలు సాగవుతున్నాయి. ఉన్నట్టుండి రెండూ కొట్టుకుపోవడంతో చుట్టుపక్కల రైతాంగానికి తీరని నష్టం జరుగుతోంది. ఆ నష్టం ఒక ఎత్తయితే? అసలు ఉన్నట్టుండి ఈ చెక్ డ్యామ్‌లు ఎందుకు కొట్టుకుపోతున్నాయి? ప్రమాద వశాత్తు అలా జరుగుతోందా? లేక పనిగట్టుకుని ఎవరైనా కూల్చేస్తున్నారా అన్న ప్రశ్నలకు ప్రస్తుతానికి సమాధానం దొరకడం లేదు. నిజానికి వరుసగా కుప్పకూలే అవకాశం లేదు. దీంతో ఇప్పుడీ ఘటను రాజకీయంగా వేడి రాజేస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలు పెంచేస్తున్నాయి. చెక్ డ్యామ్‌లు కూలిన విషయం తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు అక్కడకు వెళ్ళి పరిశీలించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయించిన నాసిరకం పనులు, అనాలోచిత చర్యల వల్లే చెక్ డ్యామ్ కూలిందని ఆరోపించారు. దాంతో బీఆర్ఎస్ నేతలు క్షేత్రస్థాయికి వెళ్లి అధికార పార్టీపై ఎదురుదాడి మొదలు పెట్టారు. తనుగుల దగ్గర కూలిన చెక్ డ్యామ్ దగ్గరికి మాజీ మంత్రులు హరీష్, గంగుల వెళ్లి ఇసుక మాఫియా కోసమే బాంబులు పెట్టి పేల్చివేశారని ఆరోపించారు. అది కూలిపోయిందా పేల్చివేశారా అన్న చర్చలు, విచారణలు జరుగుతుండగానే అడవి సోమన్ పల్లి వద్ద ఉన్న చెక్ డ్యామ్ కొట్టుకుపోవడం ఇంకా సంచలనమైంది.

## యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

నిజామాబాద్, రైతులకు యూరియా ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ ఈ యాప్‌ను వినియోగించాలని, ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడకుండా.. సులభంగా, పారదర్శకంగా అవసరమైన ఎరువులు అందేలా ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చింది. రైతులు ఇంటి దగ్గరే ఉండే ఆయా సీజన్లకు అవసరమైన ఎరువులను యాప్‌లో బుకింగ్ చేసుకొని సులభంగా పొందవచ్చు. జిల్లాలో ఇది అమల్లోకి రావడంతో ఎలా బుకింగ్ చేయాలి అన్న అంశాలపై రైతులకు కేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సమావేశాలు పెట్టి అవగాహన రైతులకు కల్పిస్తున్నారు. రైతు వేదికలు, పంచాయతీ భవనాలు, సొసైటీలు, గ్రామ కూడళ్లలో సమావేశాలు పెట్టి .. యాప్ గురించి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, మక్క, సోయా, పత్తి, చెరకు, కంది,పెసర, మినప పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటల సాగుకు విరివిగా ఎరువులు అవసరమవుతాయి. ప్రధానంగా యూరియా వినియోగంఎక్కువ. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సొసైటీలు, డీలర్ల వద్ద రైతులు ఎరువుల కోసం క్యూ కట్టవలసివస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు గంటల తరబడి లైన్లలో నిల్చోవలసివచ్చింది. కొన్ని చోట్ల లైన్లలో చెప్పులు, రాళ్లు పెట్టి ఎదురుచూసినా కొందరికి యూరియా దొరకలేదన్న ప్రచారం జరిగింది. రైతులు ఒక్కసారిగా సొసైటీలు, షాపుల ద్గరకు రావడం, కొరత రానుందన్న ప్రచారంతో అవసరానికి మించి యూరియి బస్తాలు కొని దాచుకోవాలని ఆశించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఎరువుల బుకింగ్ యాప్ తీసుకొచ్చింది. దీని వల్ల రైతులకు అవసరాలకు తగినంత యూరియా అందనుంది. యూరియా పక్కదారి పట్టే అవకాశం కూడా ఉండదు. రైతులు తమ పట్టాదారు పాసుబుక్ నంబర్, భూమి వివరాలు, పంటల సాగు వివరాలు ఎంట్రీ చేసుకోవాలి. ఆ తర్వాత తమకు అవసరమైన యూరియా బుకింగ్ చేసుకొవచ్చు. భూ విస్తీర్ణం బట్టి రైతులకు యూరియా కేటాయింపు ఉంటుంది. బుక్ చేసుకున్న 24 గంటల్లోగా రైతులు ఎరువులను తీసుకోవాలి. గ్రామాల్లో వారం రోజుల పాటు అవేర్ నెస్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

## ఆదాయం కాదు..ప్రజల ఆరోగ్యం ముఖ్యం

అమరావతి,లిక్కర్ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, బెల్టు షాపుల ఊసే లేకుండా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బెల్టు షాపులపై చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఆదాయం కాదని.. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని వ్యాఖ్యానించారు. లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు.. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె. శంకరరావు కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపించారని ప్రస్తావించారు. ఏపీలో కూడా బీసీలకు స్థానిక సంస్థల్లో వారి జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తి పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరరావు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో విషాదం

వికారాబాద్, వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో విషాదం నెలకొంది. పోదూరు మండలం రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ నిర్వహించిన ర్యాలీలో ఏడేళ్ల చిన్నారిపై నుంచి కారు వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక దుర్మరణం చెందింది.వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్‌ల ప్రమాణస్వీకరం సోమవారం నాడు పూర్తి కావడంతో రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లిబాయ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పర్మిషన్ లేకున్నా డీజేతో ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆ ర్యాలీని చూస్తున్న సమయంలోనే ఏడేళ్ల చిన్నారి కుర్వా సౌజన్యపై నుంచి సర్పంచ్ కారు వెళ్లింది. కారు చక్రాల కింద నలిగి తీవ్ర గాయాలు కావడంతో బాలికను హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. బాలిక మృతితో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. ర్యాలీలో సర్పంచ్ కారు కింద పడటంతోనే తన కూతురు మరణించిందని బాలిక తండ్రి, గ్రామస్తులు ఆరోపించారు. కానీ బాలిక కారు కింద పడలేదని సర్పంచ్ భర్త పెంటయ్య వాదించారు. దీంతో ఆస్పత్రి ముందు బాధిత కుటుంబసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడకు వచ్చిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపించేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 13 నుంచి కైట్ ఫెస్టివల్

హైదరాబాద్,సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరంలో వచ్చే నెల 13వ తేదీ నుంచి కైట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. దీని ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ వాతావరణానికి తగిన విధంగా హైదరాబాద్ నగరపు సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా కైట్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కైట్ ఫెస్టివల్ కు ప్రత్యేక గుర్తింపు, విస్తృత ప్రచారం కల్పించేలా సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. హైడ్రా ద్వారా పునరుజ్జీవింపబడిన చెరువుల వద్ద ఈ కైట్ ఫెస్టివల్ ను నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రి ఆకాంక్షను సిఎస్ తెలిపారు. దీని ద్వారా నగరంలోని నీటి వనరుల పునరుద్ధరణ లో సాధించిన విజయాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యమని ఆయన అన్నారు. గుర్తించిన ప్రదేశాల్లో కైట్ ఫెస్టివల్ కు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి సమన్వయం చేయడానికి జిహెచ్ఎంసి హెచ్ఎండిఎ, హైడ్రా తరఫున ఒక్కొక్క ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ఆదేశించారు. జనవరి మొదటి వారం నుంచి మంత్రులు పునరుద్ధరించబడిన చెరువులను స ందర్శించి

# ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యం

విజయవాడ,విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ సిద్దార్థ వైద్య కళాశాల బాలికల నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ , ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి జగన్ రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదని.. నిధులు ఇవ్వని వ్యక్తికి పీపీపీ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. ఈ కళాశాల వసతి గృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారని విమర్శించారు. 80 శాతం పూర్తయిన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు. త్వరలో మొత్తం 5 ఫ్లోర్లను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సిద్దార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 2017లోనే రూ.21 కోట్లు నిధులు మంజూరు చేశారని.. గత ప్రభుత్వం నిధులు నిలిపివేయటంతో నిర్మాణ పనులు నిలిచి పోయాయని ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్పిటల్‌కు కావలసిన నిధులను చంద్రబాబు, మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సకు పూర్తి సౌకర్యాలతో ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ తెచ్చామని ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు. కాగా.. ఎంబీబీఎస్ విద్యార్థినులు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్స్ కోసం నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గ్దదె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మి శా, అడిషనల్ డి. ఎమ్. ఈ వెంకటేష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# అతి వేగంగా గోడను ఢీకొన్న బైక్

ఏలూరు,అతివేగం ముగ్గురు యువకుల ప్రాణాలను తీసింది. బైక్ అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన సోమవారం అర్థరాత్రి పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని పోలమూరు గ్రామంలో జరిగింది. ఒకే గ్రామానికి చెందిన యువకులు కావడంతో పోలమూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు అర్థరాత్రి 12 గంటల 30 నిముషాల సమయంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళుతుండగా బైక్ అతి వేగంతో వెళ్లి అదుపుతప్పింది. రోడ్డు ఖాళీగా ఉండటంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి షాప్ గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలంలోనే ఇద్దరు యువకులు మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు కొల్లు సత్యనారాయణ (28), యేలేటి అంజిబాబు (25), యేలేటి రాజు (19) గా గుర్తించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అతి వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. యువతకు శక్తివంతమైన బైకులు ఇచ్చేముందు తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకొని సరైన పర్యవేక్షణ కల్పించాలని హితవు పలికారు.

# తుపాకీతో కాల్చుకున్న మాజీ ఐజీ

పంజాబ్: పంజాబ్ మాజీ ఐపీఎస్ అధికారి, రాష్ట్ర మాజీ ఐజీ అమర్ సింగ్ చాహల్ తన నివాసంలో తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు ప్రయత్నించడం కలకలం రేపింది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం అమర్ సింగ్ చాహల్ సోమవారం సెక్యూరిటీ గార్డు రివాల్వర్ ఉపయోగించి తనను తాను కడుపులో కాల్చుకున్నారు.సంఘటనా స్థలం నుండి 12 పేజీల సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పాటియాలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వరుణ్ శర్మ తెలియజేశారు. పంజాబ్‌లోని పాటియాలాలో చాహల్ ఆత్మహత్యాయత్నం విషయం తమ ద ృష్టికి రాగానే పోలీసు బ ృందాలు అతని నివాసానికి చేరుకుని, ఆయనను ఆస్పత్రిలో చేర్చినట్టు ప్రకటించారు. ప్రస్తుతం చాహెల్ పరిస్థితి విషమంగా ఉ ందని, ఆయనను కాపాడేందుకు వైద్యులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు.

సూసైడ్ నోట్ లో ఏముంది?

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సంఘటనా స్థలం నుండి ఒక సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నట్లు, అందులో చాహల్ ఆర్థిక మోసానికి గురయ్యాడని రాసి ఉంది. ఈ మేరకు చాహల్ పంజాబ్ పోలీస్ డీజీపీ గౌరవ్ యాదవ్‌ను ఉ ద్దేశించి 12 పేజీల సూసైడ్ నోట్ రాసినట్లు తెలుస్తోంది. ఆ నోట్‌లో రూ.8.10 కోట్ల విలువైన ఆన్‌లైన్ మోసం కేసు గురించి ప్రస్తావించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ మోసం, తీవ్రమైన ఆర్థిక నష్టాలతో ఒత్తిడికి గురైనట్టు సూసైడ్ నోట్‌లో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. చాహల్ ఐజీ పదవి నుండి పదవీ విరమణ చేసినప్పటి నుండి పాటియాలాలో నివసిస్తున్నారు.

కోట్కాపుర కాల్పుల కేసులో నిందితుడు

కాగా 2015లో ఫరీద్‌కోట్‌లో జరిగిన బెహ్బల్ కలాన్ ,కోట్కాపుర కాల్పుల కేసు నిందితుల్లో అమర్ సింగ్ చాహల్ కూడా ఒకరు. 2023, ఫిబ్రవరిలో, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎల్.కె. యాదవ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బ ృందం (సిట్) అమర్ సింగ్ చాహల్‌తో సహా పలువురు సీనియర్ పంజాబ్ అధికారులపై ఫరీద్‌కోట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది.కాగా గతంలో కూడా సీనియర్ పోలీసు అధికారి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. హర్యానాలోని సీనియర్ పోలీసు అధికారి వై. పురాన్ కుమార్ చండీగఢ్‌లోని తన నివాసంలో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తన ఆత్మహత్యకు డీజీపీ, ఏడీజీపీ ఎస్పీతో సహా 10 మంది అధికారులను నిందిస్తూ ఆయన ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాసిన సంగతి తెలిసిందే.

# కెవి చౌదరికి సెలబ్రిటీ అవార్డుతో సన్మానం

తిరుపతి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కేవీ చౌదరిని సెలబ్రిటీ అవార్డు ద్వారా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా రాజభవన్‌లో సత్కరించారు. ప్రజా డైరీ మాసపత్రిక 25 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా కె.వి చౌదరిని సెలబ్రేట్ అవార్డుతో సత్కరించామని అశోక్ గజపతిరాజు తెలిపారు. ఈ సందర్భంగా కె.వి చౌదరి మాట్లాడుతూ గోవా గవర్నర్ వద్ద ఈ అవార్డు అందుకోవడం తన చాలా ఆనందం కలిగించిందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వ్యాపారస్తుల కోసం చేసిన సేవ కార్యక్రమాలు గుర్తించి ప్రజా డైరీ మాసపత్రిక సెలబ్రిటీగా అవార్డు ఎంపిక చేయడం కాకుండా గోవా గవర్నర్ దగ్గర తీసుకోవడంతో తనపై మరింత

# ఉపాధి హామీ పథకంపై నీలినీడలు




న్యూఢిల్లీ,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ ఆర్ఇజిఎ) స్థానంలో వికసిత్ భారత్ -రోజ్ గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) 2025 లేదా జి రామ్ జి బిల్లు పై చర్చ సాధారణస్థాయిని మించి సాగుతోంది. ఈ పథకం రాజ్యాంగ సూత్రాలు, ఫెడరల్ వ్యవస్థాపరమైన సంబంధాలు, సంక్షేమ పరమైన ఆర్థిక అంశాలు, రాజకీయ ప్రతివాదంతో పాటు లక్షలాది గ్రామీణ కార్మికుల జీవన వాస్తవికతతో ముడిపడి ఉంది. ఇది కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. రానున్న దశాబ్దాలలో భారతదేశం తన పేద పౌరులతో ఎటువంటి సామాజిక సంబంధాలను కలిగి ఉండాలని కోరుకుంటోంది అన్నదే కీలక ప్రశ్న. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎంఎన్ఆర్ ఇజిఎ భారతదేశంలో అతిపెద్ద సామాజిక భద్రతా కార్యక్రమంగా సాగుతోంది. గ్రామీణ పేదలకు ఏటా కనీసం 100 రోజుల పనిని హామీగా కల్పిస్తోంది. దేశంలో పరిమిత ఉ పాధి అవకాశాలు ఉన్న రాష్ట్రాలలో ఈ పథకం కీలక పాత్ర వహిస్తోంది. ముఖ్యంగా ఈశాన్య భారతంలో, పారిశ్రామిక పెట్టుబడులు అంతంతమాత్రంగా ఉండి, వేతన ఉపాధి కాలానుగుణంగా ఉండే రాష్ట్రాలకు ఇది జీవనాధారంగా ఉంది.ఈ పథకం కొనుగోలు శక్తిని బలోపేతం చేసింది. కష్టాలను తీర్చింది, వలసలను తగ్గించింది. ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యానికి మద్దతుగా నిలిచింది. ముఖ్యంగా కొవిడ్ -19 వంటి సంక్షోభ సమయంలో ఆదాయ భద్రతను అందించింది. అయితే, ప్రస్తుతం ఎంఎన్ఆర్ ఇజిఎ పథకం అనిశ్చిత స్థితిలో ఉంది. దీనిని చక్కదిద్దేందుకు కేంద్రం చేసిన ప్రయత్నం పలు ఆర్థికపరమైన, పాలనాపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సైద్ధాంతిక, సాంకేతిక ప్రశ్నలనూ లేవనెత్తుతోంది. పేదల సంక్షేమ హక్కుగా ఉన్న పథకానికి మహాత్మాగాంధీ పేరుమార్పు కేవలం విధానపరమైన మార్పేనా. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న హిందుత్వ విధానాల కారణంగా, రాజకీయ సాంస్కృతికపరమైన నేపథ్యం ఏమయినా ఉందా. పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి. అన్నవే ఆ ప్రశ్నలు. ఈ వ్యాసం భారతదేశంలో గ్రామీణ సమాజం, రాజకీయ ఆర్థిక వ్యవస్థ ఇతర అంశాలను చర్చించడంతో పాటు ప్రమాదంలో పడిన సమస్యను పరిశీలిస్తుంది. ఎమ్ఎన్ఆర్ ఇజిఎ పథకం అమలు వల్ల ఎన్నో ఆర్థికపరమైన ప్రయోజనాలు కలిగాయని కార్తీక్ మురళీధరన్, పాల్ నీ హాస్, సందీప్ సుఖ్తంకర్ వంటి నిపుణులు పదేపదే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంవల్ల గ్రామీణుల ఆదాయం దాదాపు 14% పెరిగిందని, పేదరికం దాదాపు 26% తగ్గిందని క్షేత్రస్థాయిలో అధ్యయనాల ఆధారంగా నిరూపించారు. ముఖ్యంగా గ్రామీణ మహిళల వేతనస్థాయి పెరిగింది. మార్పు వచ్చింది. వ్యవసాయ కూలీలు, కార్మికుల బేరసారాల శక్తిని పెంచింది. ఈ పథకం వల్లనే వారికి డిమాండ్, గౌరవం పెరిగింది. గ్రామీణ పేదలకు ఎంపిక చేసుకునే అవకాశం కలిగింది.ఉ పాధి హామీ పథకం భారతదేశంలో అత్యంత సంక్షోభ సమయంలో నివారణమంత్రంగా పనిచేసింది. ముఖ్యంగా కొవిడ్ -19 మహమ్మారి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాదిమందికి సురక్షితమైన జీవనోపాధిగా మారింది. అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్ వంటి రాష్ట్రాలలో పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలు బలహీనంగా ఉన్నాయి.ప్రైవేటు ఉపాధి అవకాశాలూ తక్కువే. ఏడాది పొడవునా వ్యవసాయం ఉండదు, అలాంటి రాష్ట్రాలలో ఈ మహాత్మాగాంధీ పథకం ఆర్థికపరమైన స్థిరీకరణ శక్తిగా పనిచేసింది. పేదల ఆకలి తీర్చేందుకు అవసరమైన వేతనాలను అందించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పేదలకు అన్ని విధాలా అండగా నిలిచింది. అటువంటి పథకాన్ని నీరుగార్చడం అంటే, స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన సామాజిక హామీని అణచివేయడమేనని విమర్శకులు అంటున్నారు.ఎంఎన్ఆర్ఇజిఎ స్థానే -జి రామ్ జి -భర్తీ చేయడానికి ప్రభుత్వం మూడు కారణాలు చెబుతోంది. మొదటిది. ఈ పథకం కింద పెరిగిన వేతనాలు, ఉత్పాదకతను మించిపోయాయి. ఇది ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని పెంచింది. రెండవది. ఉపాధి హామీ పథకం కారణంగా వ్యవసాయ కార్యకలాపాలకు కార్మికులు దూరమయ్యారు. ఫలితంగా వ్యవసాయంలో కార్మిక మార్కెట్ దెబ్బతింది. మూడవది- కార్మికులలో నైపుణ్యంపెంచి, ఉత్పాదకత ఆధారంగా అభివృద్ధి సాధించడం ద్వారా, భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు వీలుగా ఈ కార్యక్రమంలో సంస్కరణలు, దిశానిర్దేశం అవసరం. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జి రామ్ జి బిల్లు కొత్తబిల్లు హామీ పనిదినాలను 100 నుంచి 125కి పెంచుతుంది. అవకాశాలు విస్తరిస్తాయి. ఒకే విధమైన వేతనాలను ప్రవేశపెడుతుంది. కొత్త వర్గాలకు అందుబాటులో ఉంటుంది. కేంద్రీకృత స్థాయిలో శ్రామికశక్తి ప్రణాళికను ప్రతిపాదిస్తుంది. ఈ సంస్కరణలు 2005 నుంచి పెద్దగా అభివృద్ధి చెందని పథకానికి అవసరమైన, ఆధునీకరణను ప్రతిపాదిస్తున్నది. ఏదైనా పెద్ద ప్రజా కార్యక్రమానికి కాలానుగుణంగా సమీక్ష అవసరమనే వాదన ఉండనే ఉంది.కొత్త బిల్లు పథకం ప్రాథమిక స్ఫూర్తిని దెబ్బతీస్తుందని వ్యాఖ్యాతలు ఆందోళన చెందుతున్నారు. ఎంఎన్ఆర్ఇజిఎ హక్కుల ఆధారితమైన పథకం.పనిని డిమాండ్ చేసి పొందవచ్చు. లేకుంటే, నిరుద్యోగ భృతి చెల్లించాలని ఇది నిర్దేశిస్తుంది. కొత్త బిల్లులో ఈ అవకాశం లేదు. డిమాండ్ ఆధారిత ఉపాధిని కేంద్రీకృత లక్ష్యాలు, బడ్జెట్ పరిమితులు నిర్దేశిస్తాయి. ఈ మార్పు చట్టపరమైన హక్కును సంక్షేమ రాయితీగా మార్చే ప్రమాదం ఉంది. ఆర్థికవేత్త ప్రతాప్ భాను మెహతా హెచ్చరించినట్లుగా ఈ సంస్కరణలు ఉపాధి హామీ పథకం సాధించిన మార్పును దెబ్బతీయవచ్చు. గ్రామీణ పేదల సాధికారత కోసం కాక, శ్రమను హక్కుగా చెప్పుకునే అవకాశం ఉంది.ఉపాధి హామి పథకం పేరు మార్పు సంచలనంగా మారింది. శ్రమకు గౌరవం కల్పించే కార్యక్రమానికి గాంధీ పేరు మార్చడం రాజకీయ పరమైన ప్రతీకవాదమే. ఈ నిర్ణయం వెనుక హిందూత్వ ఉద్దేశం ఉందా.. అన్నది ప్రశ్న. సంస్థలు, స్టేడియాలు, పథకాలు నగరాల పేర్ల మార్పు మాదిరిగానే, కొత్త సామాజిక జాతీయవాద దృక్పథానికి అనుగుణంగా ఉపాధి పథకం పేరు మార్పు జరిగింది అనుకోవచ్చు. గాంధీని బహిరంగంగా గౌరవించినా, ప్రస్తుత సర్కార్‌కు రాజకీయంగా అసౌకర్యంగా ఉంది. ముఖ్యంగా బిజెపి సైద్ధాంతిక సూత్రాలకు చుక్కెదురు. గాంధీ పేరును వికసిత్ భారత్‌తో భర్తీ చేయడం ప్రధాని మోడీ రాజకీయపరమైన ఆలోచనే. ఇది ప్రస్తుత ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో తీసుకువచ్చిన మార్పునకు తామే కారణమని క్లయిమ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. హిందూత్వ కోణం ఉ న్నా లేకున్నా, పథకంపై క్లయిమ్ చేసుకోవడానికే అన్నది సుస్పష్టం. మహాత్మా గాంధీ ఉపాధి పథకం కేంద్రానికి రాజకీయంగా అసౌకర్యంగా ఉంది. పెద్ద పథకం, పెద్దఖర్చు, గ్రామీణ పేదలే నడుపుతున్నది. ఇది పంచాయితీలకు అధికారం ఇస్తుంది. కేంద్ర ఆదేశాన్ని బలహీనపరుస్తుంది. ఇది దళితులు, ఆదివాసీలు, మహిళలు, భూమిలేని కార్మికులతో సహా, అత్యంత అణగారిన వర్గాలకు అధికారాన్ని అందిస్తుంది. బిజెపి తన ఎన్నికల ప్రచారంలో ఈశాన్య రాష్ట్రాలపై గురిపెట్టింది. ఈ కార్మిక హామీని బలహీనపరచడం తీవ్ర సామాజిక, రాజకీయ పరిణామాలకు దారితీయవచ్చు. అసోం, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్ లలో ఈ పథకంపై ఆధారపడిన గ్రామీణ కుటుంబాల ఆదాయం తగ్గడం, వలసలు పెరగడానికి దారితీయవచ్చు. ఎన్నికలపై ప్రభావం చూపవచ్చు. ఈ పథకానికి సంబంధించి ఆర్థిక వ్యవహారాలపై కేంద్రం నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రప్రభుత్వ ప్రభావాన్ని బలోపేతం చేస్తుంది.

# పొంచి ఉన్న యురేనియం ఉపద్రవం

న్యూఢిల్లీ,భూగర్భజలాల్లో, బాలింతల పాలల్లో యురేనియం స్థాయిలు ఇటీవలి పరిశోధనల్లో బయటపడడం శాస్త్రవేత్తల నుంచి వైద్య నిపుణుల వరకు ఆందోళన కలిగిస్తోంది. దీని రేడియో ధార్మిక ప్రభావం కన్నా దాని రసాయన విష ప్రభావమే ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యురేనియం స్థాయిలను తగ్గించడం ప్రభుత్వవర్గాలకు ఒక సవాలుగా మారింది. సహజంగా లభించే యురేనియం ఇటీవల దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు సార్లు బయటపడింది. దేశరాజధాని ఢిల్లీలో భూగర్భ జలాల్లో యురేనియం స్థాయిలు ఎక్కువగా ఉన్నాయని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు (సిజిడబ్ల్యుబి) అధ్యయనంలో తేలింది. బీహార్‌లో ఎఐఎంఎస్ పరిశోధకులు, మహవీర్ క్యాన్సర్ సంస్థాన్ తల్లుల స్తన్య పాలల్లో కూడా యురేనియం అత్యధికంగా ఉన్నట్టు కనుగొన్నారు. ఈ రెండు అధ్యయనాలు ఈ యురేనియం స్థాయిలు పెరిగిపోతుండడాన్ని తీవ్రంగా పరిగణించి అత్యవసర చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాయి. ఢిల్లీలో సేకరించిన 83 భూగర్భజలాల నమూనాల్లో 24 నమూనాలు బిఐఎస్ స్థాయిలకు మించి యురేనియం ఉ ందని సిజిడబ్లుబి వెల్లడించింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో 30 మైక్రోగ్రాముల వరకు యురేనియం పరిమితి ఫరవాలేదు. సహజ యురేనియం వాయువ్య భారతం లోని రాళ్లల్లో ఉంటుంది. హైడ్రొలాజికల్ పరిస్థితుల్లో రాళ్లలోంచి కరిగికరిగి నీటివనరుల్లో చివరకు భూగర్భ జలాల్లో కలుస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన ఎరువుల వాడకం వంటి కారణాల వల్ల యురేనియం ఆహార గొలుసులోకి చేరుకునే అవకాశం ఉంది. దీని కచ్చితమైన మూలాన్ని తెలుసుకోవడానికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు చేస్తోంది. నైట్రేట్, ఫ్లోరైడ్, సైనిటీ, భారీ లోహాలు కూడా అనేక ప్రాంతాల్లో ఎక్కువస్థాయిల్లో కనిపించాయి. దీనిని బట్టి నీటివనరులపై ఈ లోహ మూలకాల ప్రభావం పెరిగిందని బయటపడింది. బీహార్‌లోని ఆరు జిల్లాలకు చెందిన దాదాపు 40మంది బాలింతల తల్లిపాల నమూనాల్లో యురేనియం ఉ న్నట్టు పరిశోధనల్లో తేలింది. అన్ని నమూనాల్లో యురేనియం (యు238) ఉ న్నట్టు ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన డాక్టర్ అశోక్‌వర్మ వెల్లడించారు. దీని గాఢత 0 నుంచి 5.25 మైక్రోగ్రాములు, లీటరు మధ్య నమోదైంది. దాదాపు 70% శిశు వుల్లో యురేనియం ప్రభావం వల్ల అనేక అనారోగ్య సమస్యలువచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తల అంచనా.అయితే బాలింతల పాలల్లో యురేనియం స్థాయిలు తక్కువగా ఉన్నప్పటికీ వాటిని తాగే శిశివులు దీర్ఘకాలంలో క్యాన్సరేతర సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని, దీనివల్ల తల్లుల ఆరోగ్యం పైనా ప్ర భావం పడే అవకాశం ఉన్నట్టు గుర్తించామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.అయితే బీహార్ బాలింతల పాలలో గుర్తించిన యురేనియం స్థాయిలు సురక్షితమైన పరిమితుల్లోనే ఉన్నాయని అంటున్నారు. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన పరిమితి కంటే తాగునీటి లోనే దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా యురేనియం స్థాయిలు ఉన్నాయని బయటపడింది.



ముఖ్యంగా బీహార్‌లోని ఖగారియా జిల్లాలో యురేనియం సగటు స్థాయి అత్యధికంగా ఉండగా, కటిహార్‌లో ఒకే నమూనాలో అత్యధిక గాఢత నమోదైంది. అయితే తల్లిపాలలో యురేనియం స్వల్ప మోతాదులో ఉన్నప్పటికీ శిశువులకు ఎలాంటి ప్రమాదం ఉండదని మరికొందరు పరిశోధకులు అంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఓ) తాగు నీటిలో యురేనియం కోసం నిర్దేశించిన పరిమితి 30 మైక్రోగ్రాములు/లీటరు. తల్లిపాల నమూనాల్లో లభించిన స్థాయి (గరిష్టంగా 5.25 మైక్రోగ్రాములు/ లీటరు) ఈ డబ్లుహెచ్ఓ ప్రమాణం కంటే చాలా తక్కువగా ఉంది. శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం తల్లి శరీరంలోకి చేరిన యురేనియంలో ఎక్కువ భాగం మూత్రం ద్వారానే బయటకు వెళ్లిపోతుంది. తల్లిపాల లోకి చేరే యురేనియం శాతం చాలా తక్కువగా ఉంటుందని తెలుస్తోంది. భూగర్భజలాల్లో యురేనియం ఉన్నట్టయితే రేడియో ధార్మిక లక్షణాల కన్నా రసాయన కాలుష్యం ఎక్కువగా పెరుగుతుందని చెబుతున్నారు. మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతుంది. యురేనియం గనుల్లో పనిచేసేవారికి, యురేనియం ప్రాసెసింగ్ ప్లాంట్లలో పనిచేసే వారికి మూత్రపిండాలు దెబ్బతినే సమస్య ఏర్పడుతుంది.యురేనియం తక్కువ స్థాయిలో ఉన్న నీటిని తాగిన వారికి రేడియేషన్ కన్నా, రసాయన విష ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఢిల్లీలోని భూగర్భజలాల్లో రేడియో ధార్మికత బలహీనంగా కనిపించినా, మూత్రపిండాల కణాలపై దాని విష తీవ్రప్రభావమే దేశంలో తీరని సమస్యగా ఉంటోంది. యూరప్ లోని కొన్ని ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ప్రేరేపితమైన మూత్రపిండాల వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా గాలి కాలుష్యం, కొన్ని రసాయనాలకు గురికావడం మూత్రపిండాల వ్యాధులకు దోహదం చేస్తున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆహారం, తాగునీటిద్వారా యురేనియం లోపలికి ప్రవేశించడం సర్వసాధారణమే అయినప్పటికీ దుమ్ముధూళి పీల్చడం ద్వారా లేదా గాయపడిన చర్మం ద్వారా కూడా యురేనియం శరీరంలోకి ప్రవేశిస్తుంది. లోపలికి వెళ్లిన తరువాత ప్రధానంగా మూత్రపిండాలపైనే యురేనియం ప్రభావం మొదట కనిపిస్తుంది. ప్రధానంగా మూత్ర నాళికలను పాడు చేస్తుంది. దాంతో అవి పనిచేయకుండా పోతాయి.

# కృష్ణా నదీ జలాలపై అవగాహనా రాహిత్యం

నల్లగొండ,కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల అజ్ఞానంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నల్లగొండ జిల్లా వేదికగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి నదీ జలాల అంశంపై ఎలాంటి అవగాహన లేదని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీళ్లపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ఇటీవల జరిగిన ఒక మీడియా సమావేశంలో నీళ్ల గురించి అడిగిన ప్రశ్నలకు 'నేను ప్రిపేరయ్యి రాలేదు, రేపు వచ్చి సమాధానం చెప్తా' అని తప్పించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. మరో మంత్రి గురించి చెబుతూ 'వాటర్‌లో నీళ్లు' అని మాట్లాడే అజ్ఞాని అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల కష్టాలు, సాగునీటి అవసరాలు తెలియని వాళ్లు అడ్డదారిలో అధికారంలోకి వచ్చి హూంకరిస్తున్నారని, అబద్ధాలు చెప్పి గందరగోళం సృష్టించడం తప్ప వారికి ప్రజలపట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల కోసం కేసీఆర్ గర్జిస్తుంటే, దానికి సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం అశ్రద్ధ చేస్తోందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తిచేయలేక ఈ రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. డీపీఆర్ (ఆఖఫీ) పంపడంలో విఫలమవడమే కాకుండా, ప్రాజెక్టుల పరిధిని కుదిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారని విమర్శించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగానికి కృష్ణా జలాల్లో న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. సాగునీటి అంశంపై కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం తడబడుతోందని, ప్రజల దృష్టిని మళ్లించడానికి బెదిరింపులకు దిగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

# పంచాయితీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు.. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతారని.. మీరంతా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ సీఎం రేవంత్ శు భాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో.. నవంబర్ 11, 14, 17 తేదీల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది. మూడు దశల్లో మొత్తం 6821 స్థానాల్లో గెలుపొందింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 3520 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ 703 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 1654 స్థానాలను గెలుచుకున్నారు.

## సౌదీ అరేబియా.. ఎందుకిలా మారిపోయింది?

సౌదీ అరేబియా:ఇస్లాం మతాన్ని ఆచరించేవారు.. అల్లాను ఆరాధిస్తారు. అల్లా కొలువైవున్న ప్రముఖ పుణ్యక్షేత్రాలు మొత్తం సౌదీ అరేబియాలోనే ఉన్నాయి. సౌదీ అరేబియాలో ప్రతిదీ పద్ధతి ప్రకారం జరుగుతుంటుంది.సౌదీ అరేబియాలో నిబంధనలు కట్టుదిట్టంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో అక్కడ మద్యం అనేది ఉ ండదు. పైగా గతంలో మద్యం అనే మాట వినిపిస్తే అక్కడ కఠిన శిక్షలు విధించేవారు.. అయితే ఇప్పుడు అక్కడ పరిస్థితి లో మార్పు వచ్చింది.సౌదీ అరేబియాలో రియాద్ ప్రాంతంలో డిప్లమాటిక్ క్వార్టర్ ఉండేది. ఈ క్వార్టర్ లో బోర్డు అనేది లేని ఒక దుకాణం ఉంది. ఈ దుకాణంలోకి ఎవరినీ రానివ్వరు. గత ఏడాది జనవరిలో కేవలం ముస్లింలు కాని దౌత్యవేతల కోసం ఈ దుకాణం మొదలైంది.. ఇందులో మద్యం అందుబాటులో ఉండేది.. అయితే ఇప్పుడు ఈ దుకాణం మిగతా వారికి కూడా అందుబాటులో ఉంటుంది.. ముందస్తుగా ఎటువంటి ప్రకటన చేయకుండానే ప్రీమియం రెసిడెన్సి అనే హోదా ఉన్న విదేశీయులకు ఈ ప్రాంతంలో మద్యం కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించడం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది.అయితే ఈ దుకాణంలోకి ప్రవేశించడం అంత సులభం కాదు. ఎంట్రీ పాయింట్ వద్ద అత్యంత లోతుగా తనిఖీలు చేస్తారు. ఫోన్లు స్వాధీనం చేసుకుంటారు. కెమెరాలు లాక్కుంటారు. చివరికి కళ్ళజోడు కూడా ధరించనియ్యరు. ఒకవేళ అవి స్మార్ట్ గ్లాస్ అయితే స్వాధీనం చేసుకుంటారు. ఇక ఇక్కడ మద్యం ధరల విషయంలో తేడాలు ఉంటాయి. దౌత్యవేత్తలకు ఎటువంటి పన్నులు ఉండవు. కానీ కొత్త వినియోగదారులకు మాత్రం చుక్కలు కనిపిస్తాయి.సౌదీ అరేబియా దేశానికి చెందినవారు మద్యం తాగాలి అనుకుంటే పక్కనే ఉన్న బహ్రయిన్ ప్రాంతానికి వెళ్లేవారు. కొందరైతే దుబాయ్ కూడా వెళ్లేవారు.. అంత దూరం వెళ్లలేని వారు చాటు మార్గంలో భారీగా ధర చెల్లించి మద్యం కొనుగోలు చేసేవారు. అయితే ఇప్పుడు అనేక రకాల మార్పులు చోటు చేసుకోవడంతో ప్రీమియం రెసిడెన్సి విదేశీయులకు సౌదీ అరేబియాలో దర్జాగా మద్యం లభిస్తోంది.. ఆ మద్యం తాగిన వారు ఫుల్లుగా మత్తులో జోగుతున్నారు.ఇప్పటికే సౌదీ అరేబియాలో మహిళలు డ్రైవింగ్ సీట్లలో ప్రవేశించారు. దర్జాగా వాహనాలను తోలుతున్నారు. మద్యం దుకాణాలు కూడా త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ మద్యం ప్రీమియం రెసిడెన్సి ఉన్న విదేశీయులకు మాత్రమేనా? మిగతా వారికి కూడా లభిస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాల్సి ఉంది. 1951లో సౌదీ దేశంలో మద్యం నిషేధించారు. సౌదీ వ్యవస్థాపక రాజైన అబ్దుల్ అజీజ్ కుమారుడు మిశారీ విపరీతంగా మద్యం తాగేవాడు. తాగిన మైకంలో జెడ్డా నగరంలోని బ్రిటిష్ వైస్ కాన్సుల్ ను దారుణంగా కాల్చి చంపాడు. అప్పటినుంచి ఈ దేశంలో మద్యంపై నిషేధం ఉంది. అయితే ఈ దేశంలోకి దౌత్యవేత్తలు విపరీతంగా వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత రాజు సల్మాన్ నిబంధనలను క్రమక్రమంగా చదివించే ప్రయత్నం చేస్తున్నారు. సౌదీ అరేబియా అభివృద్ధికి ఆయన ఏకంగా విజన్ 2030 అనే ప్లాన్ కూడా రూపొందించారు.

# తెనాలి ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

గుంటూరు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం తెనాలి జిల్లా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలోని తల్లి పిల్లల విభాగాన్ని పరిశీలించిన ఆమె పలువురు రోగులు, సందర్శకులతో మాట్లాడారు. పిల్లలకు వేయించాల్సిన టీకాలను తెలియజేస్తూ ఇచ్చిన కార్డును ఆమె పరిశీలించారు. వాక్సినేషన్ పై వారికున్న అవగాహనను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు.

# కూటమిలో గొడవలు వస్తాయ్..



అమరావతి,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మరో 15 ఏళ్ల వరకు కూటమిగానే కొనసాగుతామని పదే.. పదే చెబుతున్న ఉప ముఖ్యమంత్రి తాజాగా అందుకు పూర్తి భిన్నంగా మాట్లాడారు. కూటమిలో గొడవలు వస్తాయని, అందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలని జనసైనికులు, వీర మహిళలకు కర్తవ్యబోధ చేశారు. అయితే డిప్యూటీ సీఎం చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. పవన్ ఇలా ఎందుకు మాట్లాడారు? అన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. కూటమిలో గొడవలు రాకుండా ఉంటాయా? అని ఎదురుచూస్తున్న విపక్షం వైసీపీ కూడా పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిశీలిస్తోందని అంటున్నారు. అయితే డిప్యూటీ సీఎం చేసిన ఆ వ్యాఖ్యలు కూటమి భవిష్యత్తు కోసమేనంటూ అధికార పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. మొత్తానికి ఉప ముఖ్యమంత్రి పవన్ మాటలు ఏపీలో హాట్ టాపిక్ గా మారాయి.జనసేన పార్టీ తరఫున నామినేటెడ్ పదవులు పొందిన నేతలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్వహించిన సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు పొందిన వారు జాగ్రత్తగా నడుచుకోవాలని చెబుతూనే.. భవిష్యత్తును ఊహించినట్లుగా కొద్ది రోజుల్లో జరగబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక విశ్లేషణ చేశారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల్లో సీట్ల వాటాల్లోనో.. మరో దానిలోనో గొడవలు, ఇబ్బందులు తప్పవు. అందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలి. పదవి అనేది అలంకారం కాదు. బాధ్యత. రాష్ట్రంలో సమస్యలు అన్నీ తీసుకువచ్చి నా భుజాలపై వేస్తే కుంగిపోతాను. కాబట్టి మీరు కూడా కొంత బాధ్యత, బరువు పంచుకోవాలి" అంటూ పవన్ వ్యాఖ్యానించారు. జనసేన లీడర్లకు బాధ్యతలు అప్పగిస్తూనే భవిష్యత్తుపై హెచ్చరికలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని అంటున్నారు.కూటమి అధికారంలోకి రావడానికి కీలకంగా పనిచేసిన జనసేనకు పదవులలో వాటాతోపాటు అధికారంలో భాగం పంచాలని జనసైనికులు బలంగా కోరుకుంటున్నారు. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ మధ్య మంచి సమన్వయంతోపాటు ఇద్దరూ జోడెద్దుల్లా పనిచేస్తూ ముందుకు వెళుతున్నారని అంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో.. మరికొన్నిచోట్ల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిల స్థాయిలోనూ సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని అంటున్నారు. చాలాచోట్ల వివాదాలు ముదిరిపోయి ఇరుపార్టీల కార్యకర్తలు రోడ్డెక్కుతున్నారనే వార్తలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఉప ముఖ్యమంత్రి పవన్, టీడీపీ యువనేత నారా లోకేశ్ తరచూ తమ పార్టీ కార్యకర్తలకు హితబోధ చేస్తున్నారని అంటున్నారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఇరు పార్టీల కార్యకర్తలు, నేతల మధ్య సీట్ల పంపకాలు, ఇతర విషయాల్లో భేదాభిప్రాయాలు తలెత్తే అవకాశం ఉందని టీడీపీ, జనసేన నేతలు అంచనా వేస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విభేదాలు తీవ్రమైతే భవిష్యత్తులో రాజకీయంగా పరిణామాలు దుష్ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉందనే ఆలోచనతో డిప్యూటీ సీఎం పవన్ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. కూటమి అంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మాత్రమే కాదని.. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నేతలు కూడా కలిసిమెలిసి ఉండాలనే సందేశం పంపేలా పవన్ తాజా వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో సీట్ల పంపకాలలో తేడా వచ్చినా తాము విడిపోయే పరిస్థితి ఉండదని, ఆ విషయం దృష్టిలో పెట్టుకుని ఎవరైనా సర్దుకుని పనిచేయాలన్నట్లు పవన్ మాటలు ఉన్నాయని అంటున్నారు.

# నితీష్ బాటలో స్టాలిన్.. సక్సెస్ కొడతారా ?



న్యూఢిల్లీ,బీహార్ లో నితీష్ కుమార్ తాజాగా జరిగిన ఎన్నికల్లో గెలవడానికి అనేక అస్త్రాలు వాడారు. అందులో పవర్ ఫుల్ గా పేలింది మహిళల ఖాతాలో పది వేల రూపాయలు వేయడం. అలా బీహార్ లో ప్రతీ మహిళ ఖాతాలో పెద్ద ఎత్తున నగదు జమ చేసిన తరువాత ఎన్నికలకు వెళ్ళారు. దాంతో బంపర్ విక్టరీ కొట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సీట్లతో ఐదవసారి సీఎం పీఠం ఎక్కారు. ఇపుడు ఆయన చూపించిన బాట అధికారంలో ఉన్న మిగిలిన సీఎంలకు కూడా సక్సెస్ రూట్ వేస్తోంది. 2026 మేలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో సీఎం ఎంకే స్టాలిన్ కూడా తన వద్ద ఉన్న అస్త్రాలను బయటకు తీస్తున్నారు.

సంక్రాంతి కానుకగా :

తొందరలోనే తమిళనాడులో సైతం సంక్రాంతి పండుగ రాబోతోంది. మకర సంక్రాంతి పండుగను తమిళనాడులో పొంగల్ గా జరుపుకుంటారు. అక్కడ కూడా భోగీ సంకాంతి కనుమ ముక్కనుమ ఇలా నాలుగు రోజుల వేడుక ఎంతో గొప్పగా జరుగుతుంది. ఈ పొంగల్ ని దృష్టిలో ఉంచుకుని అధికారంలో ఉన్న స్టాలిన్ ప్రభుత్వం ప్రజలకు వరాలు ప్రకటించింది. ముఖ్యంగా రేషన్ కార్డుదారులకు అయితే భారీ నజరానా ఇస్తోంది. ఈ దెబ్బతో వారి లోగిళ్ళలో అసలైన సంక్రాంతి పండుగ వచ్చేలా డీఎంకే ప్రభుత్వం గుడ్ న్యూస్ ని చెప్పుకొచ్చింది.

రేషన్ కార్డు ఉంటే చాలు :

తమిళనాడులో రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్క కుటుంబానికి కార్డుకు మూడు వేల రూపాయల నగదుని ఇస్తున్నారు. అలాగే పొంగల్ గిఫ్ట్ పేరుతో ఇస్తున్నారు. వీటితో పాటు పండుగ నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అంటే ఒక కిలో బియ్యం, కిలో చక్కెర, ఒక పొడవాటి చెరుకు గడ, ధోతీ, చీర, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, యాలకులను కూడా కిట్ రూపంలో ఇస్తున్నారు ఇవన్నీ ఒక భారీ ప్యాకేజీ రెడీ చేసి జనాలకు అందించనున్నారు. ఈ భారీ ప్రోగ్రాం ని ముఖ్యమంత్రి స్టాలిన్ జనవరి రెండవ వారంలో అంటే పొంగల్ కి ముందు ఘనంగా ప్రారంభించనున్నారు.

ఎన్నికల కోసమేనా :

ఎన్నికలు పొంగల్ తరువాత కొద్ది నెలలలోనే జరగనున్నాయి. ఎన్నికల ముందు తాయిలాలు అంటే ఎన్నికల సంఘం ఆంక్షల మధ్య వీలుపడదు, అందుకే పొంగల్ గిఫ్ట్ పేరుతో ఈ విధంగా ప్రతీ కుటుంబానికి మూడు వేల నగదు ఇవ్వడం ద్వారా స్టాలిన్ కొత్త వ్యూహాన్నే రచించారు అని అంటున్నారు. దీనిని ప్రేరణగా బీహార్ నితీష్ కుమార్ నిలిచారు అనుకోవాలి. ఆయన కూడా నవంబర్ లో ఎన్నికలు అంటే జూన్ నెలలో మహిళలకు పదివేల రూపాయల పథకం అమలు చేశారు. ఇపుడు స్టాలిన్ అదే రూట్ లో వెళ్తున్నారు, మరి నితీష్ భారీ సక్సెస్ కొట్టారు, స్టాలిన్ కూడా కొడతారా అన్నది చూడాల్సి ఉంది.

లబ్దిదారులు కోట్లలో :

ఇక చూస్తే తమిళనాడు రాష్ట్రంలో ఏకంగా 2 కోట్లకు పైగా కుటుంబ రేషన్ కార్డులు ఉన్నాయి, వీటిలో 6.75 కోట్లకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. దీంతో అతి పెద్ద సెక్షన్ నే స్టాలిన్ టార్గెట్ చేశారు అని అంటున్నారు. వీరిలో సగానికి సగం మంది ప్రభుత్వం ఇచ్చిన ఈ పొంగల్ గిఫ్ట్ పట్ల సానుకూలంగా ఉన్నా డీఎంకే సర్కార్ కి మరోసారి అధికారం దక్కడం ఖాయమని అంటున్నారు. అంతే కాదు చేతిలో అధికారం ఉంది కాబట్టి ఎన్నికలలో మరిన్ని హామీలు కూడా ముందే ఇచ్చి అమలు చేసే అవకాశం స్టాలిన్ కి ఉంది. మొత్తానికి డీఎంకే చరిత్రలో వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం అనే రేర్ ఫీట్ ని స్టాలిన్ సాధించాలని చూస్తున్నారు.

# టీటీడీలో వెలుగులోకి మరో కుంభకోణం?



తిరుమల,తిరుమల శ్రీవారి ఆలయంలో చోటుచేసుకున్న ఉదంతాలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇప్పటికే శ్రీవారి పరకామణిలో చోరీ, పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారనే అంశాలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. గత కొన్నినెలలుగా రాజకీయం కూడా ఈ రెండు అంశాల చుట్టూనే తిరుగుతోంది. దీనికి కొనసాగింపు అన్నట్లు తాజాగా 50 కిలోల బంగారం మాయం చేశారన్న మరో వివాదం తెరపైకి వచ్చినట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామి ఆలయ గోపురానికి బంగారు తాపడం చేయించారని, ఆ సమయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ఆరోపణలపై టీటీడీ విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.గోవిందరాజస్వామి ఆలయ తాపడానికి వాడాల్సిన బంగారంలో 50 కిలోలు మాయం చేశారన్న ప్రచారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై కొన్ని పత్రికలు కథనాలు ప్రచురించాయి. దీంతో మీడియాలో కూడా ఇదే విషయంపై విస్తృత చర్చ జరుగుతోంది. తిరుపతిలో శ్రీగోవింద రాజస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. 2022-23లో ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయడానికి టీటీడీ ద్వారా సుమారు 100 కిలోల బంగారం కేటాయించినట్లు చెబుతున్నారు. మొత్తం 9 పొరలతో తాపడం చేయాల్సివుండగా, కేవలం రెండు పొరలతో సరిపెట్టి దాదాపు సగం బంగారాన్ని మాయం చేశారని ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా ఆలయ విమాన గోపురంపై 30 విగ్రహాలు కూడా ధ్వంసం చేశారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై గతంలోనే పెద్ద వివాదం రేగిందని అంటున్నారు. అయితే అప్పటి టీటీడీ పెద్దలు ఈ వ్యవహారం బయటకు రాకుండా సర్దుమణిగించారని చెబుతున్నారు. ఇక విమాన గోపురం పనులను కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ కాకుండా సబ్ లీజుకు మరో సంస్థకు ఇచ్చారని అంటున్నారు. బంగారం మాయం అవ్వడానికి ఇదే కారణమా? అన్న కోణంలో విజిలెన్స్ విచారణ జరుపుతున్నట్లు చెబుతున్నారు. దాదాపు 50 కిలోల బంగారం మాయమైందనే ప్రచారం విస్తృతంగా జరుగుతుండటంతో టీటీడీ కేంద్రంగా మరో రాజకీయ వివాదం రేగే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం కొందరు భక్తుల ఫిర్యాదుపై టీటీడీ విజిలెన్స్ అంతర్గతంగా విచారణ జరుపుతోందని చెబుతున్నారు. అప్పట్లో బంగారు తాపడం పనులు చేసిన కార్మికులను ప్రశ్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీనిపై ఇప్పటివరకు టీటీడీ నుంచి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదులు వెళ్లలేదు. దీంతో బంగారం దారిమళ్లడం కేవలం ఆరోపణలేనా? నిజంగా జరిగిందా? అనేది కూడా చర్చగా మారింది. ప్రస్తుత ధరల ప్రకారం దాదాపు రూ.70 కోట్ల విలువైన బంగారం మాయమైనట్లు ఆరోపణలు వస్తుంటే ప్రభుత్వం, పాలకవర్గం ఏం చేస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# వారమే గడువు.. జిల్లాల విభజన ఏమైంది..?



అమరావతి,రాష్ట్రంలోని 26 జిల్లాల విభజనతో పాటు.. మండలాల సరిహద్దులను కూడా మార్చి.. కొత్తగా ఏర్పాటు చేయాలని కూటమి సర్కారు ప్రయత్నించింది. దీనికి సంబంధించి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో కమిటీని కూడా వేశారు. కొన్ని రోజులు హడావుడి నడిచింది. సీఎం చంద్రబాబు కూడా దీనిపై రెండు సార్లు సమీక్షించారు. కానీ, చిత్రంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మదనపల్లె, మార్కాపురం జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.కానీ, ఆ తర్వాత ఏమైందో ఎవరికీ తెలియదు. ఇక, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని కొన్ని గ్రామాలను మార్పు చేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. సొంత పార్టీ నాయకులే వద్ద ని చెప్పారు. ఈ పరిణామాల తర్వాత.. ఈ వ్యవహారం మళ్లీ తెరమీదికి రాలేదు. ఇదిలావుంటే.. మరోవైపు గడువు ముగిసిపోతోంది. వచ్చే ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలో కుల గణన ప్రారంభం కానుంది. దీంతో డిసెంబరు 29 వరకు మాత్రమే జిల్లాలు, మండలాల సరిహద్దులు మార్చేందుకు అవకాశం ఉంటుంది.అయితే.. అధికారులు మాత్రం జిల్లాల విభజన ప్రక్రియ పూర్తయిందని.. దీనిపై సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. కానీ.. ఇప్పటి వరకు సీఎంవో వర్గాలు కానీ.. ముఖ్యమంత్రి కానీ.. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు స్పందించలేదు. మరి జిల్లాలు, మండలాల విభజన ఉన్నట్టగా? లేదా? అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులు లేవు. అదేవిధంగా మదనపల్లె డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉంది.ఈ రెండు కాకుండా.. ఇతర జిల్లాలు, మండలాల విభజన అంశం మాత్రమే ఎటూ తేల్చడం లేదు. మరో వైపు పార్వతీపురం మన్యం జిల్లాను విడదీసి.. మరో జిల్లా ఏర్పాటు చేసే వ్యవహారం కూడా కొలిక్కి రాలేదు. శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని మండలాలను మార్చాలని టీడీపీ నాయకులు కోరారు. కానీ, ఇది కూడా వర్కవుట్ కావడం లేదు. వెరసి ఒకవైపు సమయం మించి పోతుండగా.. మరోవైపు, ప్రభుత్వం మాత్రం ఈ వ్యవహారంపై ఇప్పటిమౌనంగా ఉండడాన్ని బట్టి.. ఇప్పుడు వద్దులే అనుకున్నారా? లేక.. స్పందిస్తారా? అనేది చూడాలి.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు? రేవంత్ సర్కార్ రివర్స్ అటాక్!



కేసీఆర్ సైలెంట్ గా ఉన్నంతవరకూ కాంగ్రెస్ కూడా తన పని తాను చేసుకుంటూ సాగింది. కానీ కేసీఆర్ బయటకు రావడం.. కాంగ్రెస్ పై విమర్శల బాంబులు వేయడం తో కాంగ్రెస్ కూడా ఎదురుదాడికి రెడీ అవుతోంది. తాజాగా తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ ప్రకంపన మొదలైంది. గత కొంతకాలంగా ఫామ్ హౌస్ కే పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం తెలంగాణ భవన్ లో చేసిన 'పాలమూరు-రంగారెడ్డి' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించాయి. అయితే కేసీఆర్ విమర్శలకు కౌంటర్ ఇచ్చే క్రమంలో రేవంత్ సర్కార్ 'ఫోన్ ట్యాపింగ్' అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమైందనే ప్రచారం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.తెలంగాణలో గతకొన్ని రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న 'ఫోన్ ట్యాపింగ్' కేసు ఇప్పుడు క్లైమాక్స్ కు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన విమర్శలకు కేవలం మాటలతో కాకుండా.. చట్టపరమైన చర్యలతో సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం.

ప్రభాకర్ రావు వాంగ్మూలం ఆధారంగా..

ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన సమాచారం.. గత ప్రభుత్వంలోని ముఖ్యనేతల ఆదేశాల మేరకే ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేశామని ఆయన వెల్లడించినట్టు సమాచారం. ఈ వాంగ్మూలం ఆధారంగానే ఇప్పుడు దర్యాప్తు సంస్థలు తదుపరి అడుగులు వేస్తున్నాయి.

నోటీసుల దిశగా 'సిట్' అడుగులు

హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ బృందం ఈ వ్యవహారంపై సుదీర్ఘంగా విచారణ జరుపుతోంది. తాజా సమాచారం ప్రకారం.. మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. కేసీఆర్ తోపాటు గత ప్రభుత్వంలో కీలక శాఖలు నిర్వహించిన ఇద్దరు మాజీ మంత్రులకు కూడా నోటీసులు అందనున్నాయి. ఇందులో హరీష్ రావు కూడా ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. నిజనిజాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

రాజకీయ వ్యూహమా? చట్టపరమైన చర్యలా?

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ను దోషిగా నిలబెట్టేప్రయత్నం కేసీఆర్ చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి జరగాల్సిన నష్టాన్ని నివారించేందుకు పాత కేసులను తిరగదోడడం ద్వారా బీఆర్ఎస్ ను డిఫెన్స్ లో పడేయాలనేది రేవంత్ సర్కార్ వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 'తప్పుచేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు' అని రేవంత్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు నోటీసుల వార్త ఆ దిశగానే అడుగులు పడుతున్నాయని సంకేతాలిస్తోంది.కేసీఆర్ బహిరంగంగా స్పందించడంతో వెంటనే ఈ నోటీసుల అంశం తెరపైకి రావడం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠను పెంచుతోంది. ఒకవేళ నిజంగానే కేసీఆర్ కు నోటీసులు అందితే అది రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒకకీలకమైన మలుపు కానుంది. అటు బీఆర్ఎస్ శ్రేణులు కూడా దీన్ని రాజకీయ కక్ష సాధింపుగా అభివర్ణిస్తూ ప్రతిఘటించేందుకు సిద్ధమవుతున్నాయి.రాబోయే రోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి తుఫాన్ సృష్టిస్తుందో వేచిచూడాలి.

## రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

న్యూఢిల్లీ,కేంద్రంలోని భాజపాపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఓ సారి మోడీని ప్రశంసిస్తూనే మరోమారు, ఉపాధి చట్టానికి గాంధ్రు పేరు తొలగించడంపైనా విమర్శలు గుప్పించారు. తిరువనంతపురంలో బిజెపి గెలుపును స్వాగతించారు. తాజాగా బిహార్‌లోని ఎన్డీయే కూటమి పాలనను అభినందించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టిందన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు థరూర్ బిహార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంతకుముందు తాను విన్న దానికంటే బిహార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు.

# అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల రవీంద్రకుమార్!



న్యూఢిల్లీ,సుప్రీంకోర్టులో కేంద్రం తరపున వాదనలు వినిపించే కీలక పదవి అయిన అడిషనల్ సొలిసిటర్ జనరల్‌గా టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించంది. భారత ప్రభుత్వ అడిషనల్ సొలిసిటర్ జనరల్ నియామకం కేంద్ర ప్రభుత్వ న్యాయ విభాగంలో అత్యంత కీలకమైనది. దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించే బాధ్యత ఈయనపై ఉంటుంది.గత కొంతకాలంగా ఏపీకి సంబంధించి ఒక సీనియర్ న్యాయవాదినిగా నియమించాలనే ప్రతిపాదన ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిఫారసు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కనకమేడల రవీంద్రకుమార్ న్యాయవాదిగా దశాబ్దాల అనుభవం కలిగిన వ్యక్తి. టీడీపీ తరపున ఓ సారి న్యాయనిపుణుడి కోటాలో రాజ్యసభకు ఎన్నికయ్యారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. పార్టీ పరంగా కీలకమైన న్యాయ పోరాటాలను ఆయనే ముందుండి నడిపించారు.హోదాలో సుప్రీంకోర్టు లేదా వివిధ హైకోర్టులలో కేంద్ర ప్రభుత్వం తరపున హాజరై వాదనలు వినిపిస్తారు. ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలు, కొత్త చట్టాల విషయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా సలహాలు ఇస్తారు. రాష్ట్రపతి కోరినప్పుడు రాజ్యాంగపరమైన సంక్లిష్టతలపై వివరణ ఇవ్వడం ఆయన విధుల్లో భాగం. మూడేళ్ల పాటు ఆయన పదవీ కాలం ఉంటుంది.

# అది సాధిస్తే 100 కోట్ల ప్రైజ్ మనీ



అమరావతి,అక్షరాలా వంద కోట్లు.. అంటే వెయ్యి మిలియన్లు.. ఈ మొత్తాన్ని ఒకరికి ఇస్తానని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీ నుంచి ఎవరైనా నోబుల్ ప్రైజ్ సాధిస్తే వంద కోట్లు ఇస్తామని గతంలో ప్రకటించాం.. క్వాంటం టెక్నాలజీ ద్వారా దీనిని ఎవరైనా అందిపుచ్చుకుంటే వారికి వందకోట్లు ఇస్తాం అని ఆయన అన్నారు.క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్ కార్యక్రమం ఈ రోజు జరిగింది. వర్చువల్ గా ఈ కార్యక్రమానికి వైసర్, క్యూబిట్ సంస్థల ప్రతినిధులు, ఐఐటీ చెన్నై, తిరుపతి డైరెక్టర్లు. వేల మంది టెక్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో సీఎం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.నోబెల్ బహుమతికి నగదు బహుమతి 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్ ఇస్తారు. అంటే సుమారు 1.17 మిలియన్ అమెరికన్ డాలర్లు లేదా రూ. 10.36 కోట్లు ఉంటుంది, ఇది ప్రతి సంవత్సరం మారుతుంది, అటువంటిది ఒక రాష్ట్ర సీఎం ఏకంగా 100 కోట్లు ప్రకటించడం విశేషం.ఏ అంశంలో అయినా ఏపీ ఫాస్ట్ లెర్నర్ అని సీఎం అన్నారు. ఏ సాంకేతికత అయినా విప్లవమైనా ఏపీ సారధ్యం వహిస్తుంది. ఎవరినీ అనుసరించదని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను కూడా వచ్చే రెండేళ్లలో అమరావతి నుంచే ఉత్పత్తి చేసి ప్రపంచానికి అందిస్తాం అన్నారు. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్, క్యురేటివ్ హెల్త్‌ను క్వాంటం అప్లికేషన్ల ద్వారా అందించే అవకాశం ఉంటుందన్నారు. క్వాంటం రంగంలో లక్ష మంది క్వాంటం నిపుణుల్ని తయారు చేసుకోవటమే లక్ష్యం అని సీఎం తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com